## బాలిక మృతి కేసులో నిందితునికి జైలు శిక్ష

నవతెలంగాణ-పర్వతగిరి

మైనర్ బాలికను గోడకుకొట్టిన మృతికి కారణమైన కేసులో కోర్టు నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.25వేల జరిమాన విధించినట్లు ఎస్ఐ ఇమ్మడి వీరభద్రరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పెద్దతండాకు చెందిన లునావత్ సిఖిందర్ కుమార్తె అనూష (13)ను అదే తండాకు చెందిన భూక్యా గణేష్ ప్రేమిస్తున్నాని వేధింపులకు గురిచేస్తూ 2018 డిసెంబర్ 12న సాయంత్రం 4.30 గంటలకు ఇంట్లో రొట్టెలు చేస్తుండా గోడకు వేసి బాదాడు. మరుసటి రోజు పాఠశాలకు వెళ్లిన అనూష తలతిరిగి కిందపడిపోవడంతో తల్లిదండ్రులు వరంగల్ ఎంజీఎంకు చికిత్సనిమిత్తం తరలించగా తలలో రక్తంగడ్డకట్టిందని పరిస్థితి విషమంగా ఉందని నిమ్స్‌కు తీసుకవెళ్లాలనివైద్యులు సూచించగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. అనంతరం గ్రామానికి తీసుకువచ్చి ఖననం చేశారు. ఈ విషయంలో గణేష్‌పై అనుమానం వచ్చిన మృతురాలి తల్లిదండ్రులు పర్వతగిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీధర్‌రావు విచారణ జరిపి చార్జీషీట్ ఫైల్ చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో వరంగల్ రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వై.సత్యేంద్ర భూక్యా గణేష్‌కు 10 ఏళ్ల జైలుశిక్ష, రూ.25వేల జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ వివరించారు.

నవతెలంగాణ 1
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
గురువారం డిసెంబర్ 28, 2023 www.navatelangana.com

## ఎమ్మెల్యే 'దొంతి'ని కలిసిన మహిళా సమన్వయ సమితి ప్రతినిధులు

నవతెలంగాణ-నర్సంపేట



ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మహిళా సమన్వయ సమితి ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. బుధవారం ఆర్ అండ్‌బీ గెస్టుహౌజ్‌లో ఎమ్మెల్యేను కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు చిలువేరు రజనీ భారతీ, కార్యదర్శి గొర్రె రాధ, ఎస్‌కే.కాజాబి, జాటోతు ఉషా, సుంకరనేని జానకి, వజినపెల్లి శారద, కోమటి సరోజన, తక్కెళ్లపెల్లి ఉమాదేవి, ఎస్‌కే.వహిదా, గోపాలపు పద్మ వడ్లకొండ స్వరూప, ముత్యాల జ్యోతి, కాజీపేట అనిత, శంకబోయిన యశోద, సుందరగిరి పుష్పలీల, బొంకూర హైమా, దాసరి రమణ, చిప్ప మంజుల, మండల కాంతమ్మ, ఓదెల రాజేశ్వరి, పావని తదిరులు పాల్గొన్నారు.

## నేటి నుండే 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ షురూ

- అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి
- ఎనిమిది రోజుల పాటు సభలు నిర్వహణ
- వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-వరంగల్




జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ఈనెల 28 నుండి జనవరి 6 వరకు ప్రజాపాలన గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, మొదలైన పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామ,వార్డుసభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 8రోజులపాటు గ్రామ వార్డు సభలను నిర్వహిస్తుండగా ఇందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామ, వార్డు సభలలో ప్రజల నుండి ప్రభుత్వ పథకా లకు దరఖాస్తులను స్వీకరించేందుకు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామ సభకు ముందురోజే ఆయా గ్రామపంచాయతీలలో గ్రామ కార్యదర్శులు, ఇతర అధికారులు దరఖాస్తుపత్రాలను ప్రజలకు అందజేస్తారని, దరఖాస్తు పత్రాలను నింపి ఆయాతేదీల్లో నిర్వహించే గ్రామ సభల్లో అధికారులకు అందజేయాలని సూచించారు. ప్రజలు నింపినదరఖాస్తు పత్రంతో పాటు ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డ్, ఫోటోతో జత చేసి అందించాలన్నారు. 8 రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. కాగా వరంగల్ జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీలు, వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని వరంగల్ జిల్లాకు చెందిన 32 డివిజన్లలో నిర్వహించే ప్రజా పాలన గ్రామ, వార్డు సభల వివరాలను కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు.

## బాలికలకు సైకిళ్ల వితరణ

నవతెలంగాణ-గీసుకొండ



జీబ్ల్యుఎంసీ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారం జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్‌లో ఇన్నర్‌వెల్ సంస్థ వారు అందించిన 25 సైకిళ్లను బాలికలకు డీఈవో వాసంతి బుధవారం అందించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ సంస్థ సమాజ సేవను, ఉదారతను అభినందించారు. కార్యక్రమంలో ఇన్నర్ వేల్ సంస్థ అధ్యక్షులు శ్రీలత, సెక్రటరీ లావణ్య, జిల్లా చైర్మన్ విజయగోపాల్, ప్రిన్సిపాల్ సాంబయ్య, కోఆప్షన్ సభ్యులు కొక్కొండ శ్రీకాంత్, ఇన్నర్‌వెల్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 29న బస్‌డిపోల ముట్టడి

నవతెలంగాణ-మట్టెవాడ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణ సర్వీసుల ను నిరసిస్తూ ఈనెల 29న ఆర్టీసీ బస్ డిపోలను ముట్టడించాలని ఏకగ్రీవంగా తీర్మాణించినట్లు ఐక్యవేదిక బాధ్యులు ఈసంపెల్లి సంజీవ, మడికొండ బాబు, ఎండి సిరాజ్, వెంకటేష్, బొల్లం సంజీవ, శివప్రసాద్, రమేష్, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్‌లు తెలిపారు. బుధవారం వరంగల్ ఉమ్మడి జిల్లాల వివిధ ఆటో యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలోని గోవిందరాజుల గుట్ట ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో తీర్మాణించారు. ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ఆందోళన తీవ్ర స్థాయిలో పెంచుతామన్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని కల్లెడ, బూరుగుమల్ల గ్రామాల మధ్యన నూతనంగా నిర్మిస్తున్న భైరవ ఆంజనేయ స్వామి గుట్టపై అన్య మతస్తులు వేసిన సిలువ గుర్తు వేయడాన్ని ఖండిస్తూ బుధవారం హిందవ నాయకుల ఆధ్వర్యంలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించి స్థానిక పోలీస్ స్టేషన్ లో వినతిపత్రం అందజేశారు. ఆలయంలో సిలువ గుర్తు లు వేసిన దోషులను గుర్తించి వెంటనే అరెస్టు చేసికఠినంగా శిక్షించాలని కోరారు.

## బాధితులకు మాజీ ఎమ్మెల్యే చల్లా పరామర్శ


నవతెలంగాణ-గీసుకొండ



మండలంలోని ఉకల్ గ్రామానికి మొగుసాని రమేష్ రైలు ప్రమాదంలో మృతిచెందగా వారి కుటుంబాన్ని, రోడ్డు ప్రమాదంలో గాయపడిన శాయంపేటకు బీఆర్ఎస్ నాయకులు ముంత రాజయ్యను ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కలిసి వారిని పరామర్శించారు కార్యక్రమంలో గీసుకొండ మండల పార్టీ అధ్యక్షుడు విరగోని రాజకుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొల్బుల కట్టయ్య, మండల యూత్ అధ్యక్షులు శిరీసే శ్రీకాంత్, డివిజన్ నాయకులు గోలి రాజయ్య, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేద పాఠశాలకు బీరువాలు అందజేత


నవతెలంగాణ-మట్టెవాడ



వేద పాఠశాల విద్యార్థుల అవసరాల కోసం శ్రీప్రతివాది భయంకర అప్పన్ కృష్ణమాచార్య చారిటబుల్ ఫౌండేషన్ ట్రస్ట్ వరంగల్ వారు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ద్వారా శ్రీ భద్రకాళి సాంగవేద ఆగమ సంస్కృత విద్యాలయం (వేదపాఠశాల)కు విద్యార్థుల నిత్యావసరాల సౌ కర్యార్థం 6 బీరువాలు కార్యనిర్వహణాధికారి శేషుభారతికి బుదవారం అందచేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సుధ, డాక్టర్ హరి జి, జ్యోతిర్మయి, దిడ్డిగ రమేష్, సునిత,శ్వేత రంగనాథ్, సుధ, లక్ష్మి, వేదపాఠశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-కాశిబుగ్గ



అనారోగ్యంతో మృతి చెందిన ఆటో డ్రైవర్ కొల్లోజు రవి కుటుంబానికి బుధవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన రవి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆటో యూనియన్ నాయకులు బుధవారం రవి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు దుంపేటి శ్రీను, అడుప మహేష్, హన్మకొండ కుమార్, పాలకుర్తి ప్రసాద్, కేతిరి వెంకన్న, జావీద్, వేణు, సాంబయ్య, మధు,పాషా, గౌస్,శీను, పోషాలు పాల్గొన్నారు.

# పెరిగిన అత్యాచారాలు, వైట్‌కాలర్ నేరాలు

- 7.71 శాతం నేరాల పెరుగుదల



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది మహిళలపై అత్యాచారాలు పెరిగాయి. మొత్తంగా నేరాలు 7.71శాతం పెరగ్గా, ఇందులో మహిళలపై అత్యాచారాలు అధికంగా పెరగడం గమనార్హం. ఇండ్ల తాళాలు పగులకొట్టి చేసే దొంగతనాలు 47.74 శాతం పెరగడం ఆందోళన కలిగిస్తుంది. ఆయుధాలతో బెదిరించి, భయపెట్టి చేసే డెకాయిటీలు 33శాతం తగ్గడం గమనార్హం. హత్యలు 7.7 శాతం పెరగ్గా, అత్యాచారాలు మాత్రం 36.3 శాతం పెరిగాయి. మోసాలు 33శాతం పెరిగాయి. ఫైనాన్షియల్ ఫ్రాడ్ కేసులు పెరిగాయి. గత ఏడాది 631 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 1,095 కేసులు నమోదు కావడం గమనార్హం. రోడ్డు ప్రమాదాలు 32.8 శాతం పెరిగాయి. ఘోర రోడ్డు ప్రమాదాల్లో అధిక వేగం వల్లనే సంబవిస్తున్నట్లు పోలీసు అధికారులు ధృవీకరించారు.

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మహిళలపై అత్యాచారాలు పెరగడం ఆందోళనకరంగా మారింది. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాలు వున్నాయి. ఈ మూడు జిల్లాల్లో ఈ ఏడాది జరిగిన నేరాలు, ఘోరాలకు సంబంధించి పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ విడుదల చేసిన వార్షిక నేరాల నివేదికను పరిశీలిస్తే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా పెరిగాయి. ఈ ప్రమాదాలు అధిక వేగం, హెల్మెట్, సీటు బెల్ట్ ధరించకపోవడం వల్లనే ఘోరరోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం అధికంగా జరిగిందని పోలీసు అధికారులు నిర్ధారించారు.

### పెరిగిన అత్యాచారాలు

ఈ ఏడాది మహిళలపై అత్యాచారాలు పెరిగాయి. గత ఏడాది మహిళలపై 135 అత్యాచారాలు జరగ్గా, ఈఏడాది 184 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా గత ఏడాదితో పోల్చితే మహిళలపై అత్యాచార సంఘటనలు 36 శాతం పెరిగాయి. ఇందులో పెళ్లి చేసుకుంటానని నమ్మించి లొంగతీసుకొని అత్యాచారం చేసిన ఘటనలు 48 వున్నాయి. పొరుగువారిని లేదా కలిసి పని చేసే చోట, కలిసి ఉద్యోగం చేస్తున్న వారిపై 36మందిపై అత్యాచారం ఘటనలు చోటుచేసుకున్నాయి. కిడ్నాప్ లేదా నమ్మించి తీసుకువెళ్లి అత్యాచారం చేసిన సంఘటనలు 72 వున్నాయి. 3 చోట్ల గ్యాంగ్‌రేప్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో మహిళలపై 18 శాతం కేసులు పెరిగాయి. గత ఏడాది మహిళలపై జరిగిన నేరాలు 1,435 కాగా, ఈఏడాది 1,705 నేరాలు జరిగాయి. వరకట్న చావులు ఈ ఏడాది 20 (6 శాతం), వేధింపుల కేసులు 648 (71) శాతం పెరిగాయి. పోక్సో కేసులు 209 (48 శాతం) నమోదయ్యాయి. కిడ్నాప్‌లు 145 ( −31 శాతం) నమోదు కాగా, లైంగిక వేధింపులు 395 (91 శాతం) కేసులు నమోదయ్యాయి.

### భూ వివాదాల్లోనే అధికంగా ఎస్సీ, ఎస్టీ కేసులు

భూ వివాదాల్లోనే అధికంగా ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరుగుతున్న సందర్భాలున్నాయని గణాంకాలను బట్టి స్పష్టమవుతుంది. గత ఏడాది ఎస్సీ, ఎస్టీలపై జరిగిన దాడులు 176 కాగా, ఈ ఏడాది 172 కేసులు నమోదయ్యాయి. భూ వివాదాల సందర్భంలోనే అధికంగా ఎస్సీ, ఎస్టీలపై దాడులు లేదా కులంపేరిట దూషించే సంఘటనలు చోటు చేసుకుంటున్నాయ.

37 కేసులు ఇలాంటి పరిస్థితిలోనే నమోదు కావడం గమనార్హం. ప్రేమ, అక్రమసంబంధాల విషయంలో 29 కేసులు నమోదయ్యాయి.

### ఆన్‌లైన్ మోసాలు అధికం

ఈ ఏడాది ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి కేసులు అధికంగా (69 శాతం) నమోదయ్యాయి. డబ్బులకు సంబంధించి ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి 2021లో 150 కేసులు నమోదు కాగా, 2022లో 553, 2023లో 1,027 కేసులు నమోదయ్యాయి. డబ్బుతో సంబంధంలేని ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి ఈ ఏడాది 69 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా 1,095 కేసులు నమోదయ్యాయి.

### పగటి వేళ దోపిడీలే అధికం

ఈ ఏడాది సొత్తు చోరీలకు సంబంధించి 911 కేసులు నమోదయ్యాయి. లబ్ధి కోసం హతమార్చడం, డెకాయిటీ, రాబెరీ, పగటి వేళ ఇండ్లు పగులకొట్టి చోరీలు, రాత్రిపూట ఇండ్ల దోపిడీ, సాధారణ చోరీలు, ఆటోమోబైల్స్ చోరీలు మొత్తంగా 911 కేసులు నమోదయ్యాయి. ఇందులో 486 కేసులను పరిష్కరించారు.

ఈ కేసులకు సంబంధించి 1006.112 లక్షల సొత్తు చోరీకి గురైంది. ఇందులో పలు కేసులను విచారణ పూర్తి చేసి, నిందితులను అరెస్ట్‌చేసి వారి నుండి రూ.461.84 లక్షల (36 శాతం)ను తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

| నేరం | 2021 | 2022 | 2023 | పెరుగుదల/ తగ్గుదల శాతం |
|---|---|---|---|---|
| డెకాయిటీ | 2 | 3 | 2 | -33 |
| రాబెరీ | 28 | 16 | 20 | 25 |
| బర్గలరీ | 199 | 222 | 328 | 47.74 |
| సాధారణచోరీలు | 482 | 558 | 559 | 0.1 |
| హత్యలు | 53 | 41 | 44 | 7.3 |
| ఘర్షణలు | 47 | 77 | 70 | -9 |
| పిల్లల అపహరణ | 183 | 195 | 190 | -3 |
| అత్యాచారాలు | | | | |
| (పోక్సో) | 96 | 135 | 184 | 36.3 |
| వైట్‌కాలర్ నేరాలు | | | | |
| మోసాలు | 741 | 1,500 | 1,994 | 33 |
| నకిలీ కరెన్సీ | 1 | 5 | 1 | -80 |
| నమ్మించి మోసం | 3 | 5 | 8 | 60 |
| ఇతరఐపిసి కేసులు | 4,611 | 4,717 | 5,016 | 6.3 |
| సిఆర్‌పిసి కేసులు | 2,073 | 2,461 | 2,493 | 1.3 |

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

| | 2021 | 2022 | 2023 | పెరుగుదల / తగ్గుదల శాతం |
|---|---|---|---|---|
| ప్రమాదాలు | 1,180 | 1,149 | 1,526 | 32.8 |
| మృతులు | 460 | 438 | 487 | 11.18 |
| క్షతగాత్రులు | 1,142 | 1,118 | 1,361 | 21.73 |

### పెరిగిన రోడ్డు ప్రమాదాలు

ఈ ఏడాదిలో రోడ్డు ప్రమాదాలు 32.8 శాతం పెరిగాయి. గత ఏడాది రోడ్డు ప్రమాదాలు 1,149 జరగ్గా, ఈ ఏడాది 1,526 రోడ్డు ప్రమాదాలు సంభవించాయన్నారు. గతంలో రోడ్డు ప్రమాదాల్లో 438 చనిపోతే, ఈ ఏడాది 487 (11.18 శాతం) జరిగాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గత ఏడాది 1,118 మంది గాయపడితే, ఈ ఏడాది 1,361 (21.73 శాతం) మంది గాయపడ్డారన్నారు.

ఎంవి ఆక్టు కేసులు గణనీయంగా అంటే 58.10 శాతం తగ్గాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు సైతం 39.7 శాతం తగ్గాయి.

### అధిక వేగంతోనే..

ఘోర రోడ్డు ప్రమాదాలు అధిక వేగం వల్లనే అధికంగా జరుగుతున్నట్లు పోలీసు అధికారులు విశ్లేషించారు. ఈ ఏడాది 450 ఘోర రోడ్డు ప్రమాదాలలో 174 సంఘటనలు అధిక వేగం వల్లనే జరిగాయని పోలీసు అధికారులు ధృవీకరించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల 135 సంఘటనల్లో మృతిచెందారు. 22 సంఘటనలు ట్రాఫిక్ నిబంధనలకు భిన్నంగా వెళ్లడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకున్నట్లు విశ్లేషించారు.

### నేరారోపణ నిరూపితంలో వైఫల్యం

వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో వివిధ కేసుల్లో నేరారోపణను నిరూపించడంలో పోలీసు అధికారుల వైఫల్యం కనిపిస్తుంది. 2021లో 5,504 కేసుల్లో 139 కేసుల్లో (52 శాతం) మాత్రమే పోలీసు అధికారులు ఎవరిపై నేరారోపణ చేశారో వాటిని నిరూపించగలిగారు. 2022 లో 4,949 కేసుల్లో 138 కేసుల్లో (40 శాతం) మాత్రమే పోలీసు అధికారులు నేరాన్ని నిరూపించారు. 2023లో 4,854 కేసుల్లో 147 కేసుల్లోనే (30 శాతం) నేరాన్ని పోలీసులు నిరూపించడం గమనార్హం.

## కలిసికట్టుగా నగరాన్ని అభివృద్ధి చేద్దాం : నగర మేయర్

నవతెలంగాణ-వరంగల్



అందరి సహకారంతో కలసికట్టుగా ఉంటూ నగరాన్ని అభివృద్ధిచేసి అగ్రభాగాల నిలబెట్టాలని బల్దియా మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో నగర మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ముందుంచిన 4 ఎజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలుగా ఎన్నికై మొదటిసారిగా కౌన్సిల్‌కు హాజరైన ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజులను నగరమేయర్, కమిషనర్, కార్పొరేటర్లు శాలు వాలతో సత్కరించి, పూలమొక్కలు అందించి ఘనం గా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ ను ఉద్దేశించి మేయర్ గుండు సుధారాణి మాట్లాడు తూ గ్రేటర్ పాలక సర్వసభ్య సమావేశానికి విచ్చేసిన పరకాల, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి,కె ఆర్.నాగరాజు, కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా, డిప్యూటిమేయర్ రిజ్వాన షమీమ్,కార్పొరేటర్లు, అధికారులకు రాబోయే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర మంత్రివర్గంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖకి ప్రాతినిధ్యం లభించినందుకు వరంగల్ నగర ప్రజల తరుపున శుభాకాంక్షలు తెలిపారు.

2021 మే నెలలో ప్రస్తుత పాలక వర్గం కొలువు తీరిందని, గడిచిన రెండున్నరేళ్ళ లో వరంగల్ నగర అభి వద్ధి కోసం పాలక వర్గం పని చేసిందని, రానున్న రెండున్నరేళ్లలో మంత్రి, పార్లమెంట్‌సభ్యులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యుల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులను చేపడుతామని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. వరంగల్ స్మార్ట్ సిటీగా ముందుకు వెళ్తున్నదని, రానున్న రోజులలో ప్రతీ ఇంటికి ప్రతి రోజు 24 గంటల త్రాగు నీటి సరఫరా చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తూ, నగరంలోని 66 డివిజన్లలో ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుదామని, అంతే కాకుండా నూతనంగా ఎన్నికైన మంత్రి, ఎంపీలు, శాసన సభ్యులు, శాసన మండ లి సభ్యులు, కార్పొరేటర్లు అందరి సహకారంతో వరంగల్ నగరాన్ని అభివద్ధిలో అగ్ర భాగాన నిలబెడుతామన్నారు. కరోనా కేసులు పెరుగుతున్న సమయంలో పరిధిలోని అన్ని వార్డులలో పటిష్ట కార్యచరణ ప్రణాళిక ద్వారా పారిశుద్యం క్రమం తప్పకుండా నిర్వహించాల ని మేయర్ అధికారులను ఆదేశించారు.




### గ్రేటర్ లో సమగ్రాభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే రేవురి ప్రకాశ్ రెడ్డి




గ్రేటర్ వరంగల్ సమగ్రాభివృద్ధికి తనసహకారం సంపూర్ణంగా ఉంటుందని, పరకాల నియోజకవర్గంలోని మూడు డివిజన్లు జీడబ్ల్యూఎంసీలో ఉన్నాయని, వాటి అభివృద్ధికి సహకరించాలని కోరారు. త్వరలో అగ్రంపాడు జాతర జరగనున్న దృష్ట్యా హైమాస్ట్ స్తంభాలకు దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు.

### కలిసికట్టుగా అభివద్ధి చేద్దాం : ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన వరంగల్‌ను కలిసికట్టు గా అభివృద్ధి చేద్దామన్నారు. వివిధ గ్రాంట్‌ల కింద రావలసిన నిధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి అవసరం ఉన్నదని, మొట్టమొదట ప్రాధాన్యత వరంగల్ పట్టణ సంపూర్ణ అభివద్ధికి ఐక్యంగా కషి చేద్దా మని అన్నారు. భద్రకాళి చెరువులో గుర్రెపు డెక్కను తొలగించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

### అభివద్ధికి అందరు సహకరించాలి : ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు



జీడ బ్ల్యూఎంసీ లో వర్ధన్నపేట నియోజ కవర్గంలోని 13 డివిజన్లు ఉన్నాయని వాటి అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలన్నారు. అయినవోలు జాతరకు బల్దియా తరపున సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా, డిప్యూటీ మేయర్ రిజ్వానా శమీమ్ మసూద్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచులకు భరోసాగా కళ్యాణ లక్ష్మి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



నవతెలంగాణ-వర్ధన్నపేట

పేద కుటుంబాలలో జన్మించిన ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకం ఎంతో భరోసానిస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు అన్నారు. బుధవారం వర్దన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వర్దన్నపేట మండలానికి చెందిన 34 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం పేద ప్రజలకు ఎంతోఆసరాగా నిలుస్తుందన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు వివాహాలకు చేసే ఖర్చు భారం తగ్గిందని తెలిపారు. ఆడపిల్లల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడవద్దు అనే ఉద్దేశంతో సీఎం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆంగోత్ అరుణ, ఎంపీపీ అప్పారావు, జెడ్పిటిసి మార్గం బిక్షపతి, వర్ధన్నపేట తహసిల్దార్ పాణి, వివిధ గ్రామాల సర్పంచులు ,ఎంపీటీసీలు ,వార్డు కౌన్సిలర్లు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**పర్వతగిరి :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు.మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన 191 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుండి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ఎన్నికల ముందు మేనిఫెస్టో లో పొందుపరిచిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి పూర్తి స్థాయిలో తీసుకువెళ్ళి అందరినీ ఆదుకోవాలనే సదుద్దేశ్యంతో ప్రజా పాలన కార్యక్రమం చేపట్టిందని చెప్పారు.

ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ దరఖాస్తులు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రజా సంక్షేమం కోసమే నిరంతరం కషి చేస్తూ ఈ ఐదు సంవత్సరాల లో అందరికీ పథకాలు చేరవేసే దిశగా ప్రభుత్వం కషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమల జెడ్పీటీసీ సింగ్ లాల్,స్థానిక సర్పంచ్ చింతపట్ల మాలతి, తహసీల్దార్ టి వెంకటస్వామి, ఎంపీడీఓ చక్రాల సంతోష్ కుమార్, ఎంపిఓ పాక శ్రీనివాస్,సంబంధిత అధికారులు,మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మట్టెవాడ

ట్రాఫిక్ పోలీసుల చేత డ్రంక్ అండ్ డ్రైవ్ లో, లైసెన్స్ లేకుండా మైనర్ డ్రైవింగ్ కేసులలో పట్టుబడి వాహనాలు సీజ్ చేయబడిన వారు లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకొని కేసులను త్వరితగతిన పరిష్కారం చేసుకోవచ్చని అలాగే పెండింగ్ చాలాన్ల విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డిస్కౌంట్ లను సద్వినియోగం చేసుకో వాలని వరంగల్ ట్రాఫిక్ సిఐ పి వెంకన్న సోమవారం ప్రజలకు తెలియజేశారు. డిసెంబర్ 26 నుండి 30 శనివారం వరకు హన్మకొండ రెండవ తరగతి కోర్టులో లోక్ అదాలత్‌లు జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

## మత్తు పదార్థాల రహిత కమిషనరేటే లక్ష్యం : వరంగల్ సీపీ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



మత్తు పదార్థాల రహిత కమిషనరేట్‌గా వరంగల్ పోలీసు కమిషనరేట్‌ను మార్చడమే మనందరి ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్‌ఝూ అధికారులకు సూచించారు. బుధవారం కమిషనరేట్ వార్షిక నేరసమీక్షా సమావేశాన్ని భీమారంలోని శుభంకళ్యాణ వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ మాట్లాడుతూ కేసులను పూర్తిచేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్టేషన్ అధికారులు పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్యమైన కేసుల పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు మత్తుపదార్థాల నియంత్రణ, భూ కబ్జాలకు పాల్పడే వారిని గుర్తించి వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. విజుబుల్ పోలీసింగ్‌తోపాటు నిరంతరం పెట్రోలింగ్ చేస్తుండాలన్నారు. కొత్త సంవత్సరం వేడుకలపై దృష్టి సారించాలన్నారు. కొత్త సంవత్సరం వేడుకల వేళ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమాలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికలకు సైతం సమాయత్తం కావాలన్నారు. శాసనసభ ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో ప్రతిభ కనపరిచిన ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలకు పోలీసు కమిషనర్ ప్రశంసా పత్రాలను అందచేశారు.

ఈ కార్యక్రమంలో డిసిపిలు రవీందర్, అబ్దుల్ బారీ, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## 29న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

నవతెలంగాణ-సుబేదారి

ఈనెల29న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నమని హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులకు ఈ నెల29న ములుగు రోడ్‌లోని ప్రభుత్వ ఐటిఐ క్యాంపస్ జిల్లా ఉపాది కల్పన కార్యాలయంలో జాబ్ మేళా కు హాజరు కావాలన్నారు. శ్రీ సాయి అగ్రి టెక్నాలజీస్ హైదరాబాద్ కంపనీలో 50 మార్కెటింగ్ సేల్స్ ఆఫీసర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని 21 నుండి 30 ఏళ్లలోపు నిరుద్యోగ యువత అర్హులు అన్నారు. రూ.10వేల వేతనంతోపాటు టిఎ, డిఎతో హనుమకొండ, వరంగల్ జిల్లా పరిసర ప్రాంతాలలో పని చేయవలసి ఉంటుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇంటర్మీడియట్, 2 వీలర్ కలిగి ఉండాలి. అర్హత ఆసక్తి గల యువతి యువకులు విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపిలతో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ప్రభుత్వ ఐటిఐ క్యాంపస్ ములుగు రోడ్‌నందు 29న జరుగు జాబ్ మేళాకు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్, 4 పాస్‌పోర్ట్ ఫోటోస్ తో హాజరు కావలసిందిగా కొరారు.

మరిన్ని వివరాలకు 9848895937, 9908768489 నెంబర్లలో, జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## కొత్తగట్టు శ్రీనివాస్ ఆరోపణల పట్ల ఖండన

నవతెలంగాణ-కాజీపేట

రాష్ట్ర స్థాయి పదవీ కాలం పూర్తయిన తర్వాత వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఏకపక్షంగా కొత్తగట్టు శ్రీనివాస్ ఆరోపణలు చేయడానికి ఖండిస్తున్నట్లు ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. కాజీపేటలోని పెద్దమ్మ తల్లి గుడి ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన మెపా కమిటీల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడాతు కొత్తగట్టు శ్రీనివాస్ తనపై చేసిన ఆరోపణలపై పెద్దమ్మ గుడిలో ప్రమాణం చేయడానికి తను సిద్ధమా అని సవాల్ విసిరారు. ఐదు సంవత్సరాలుగా విలువైన కాలాన్ని, ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి త్యాగంగా జాతి కోసం సేవ చేస్తున్న క్రమంలో ఓర్వలేనితనంతోనే నిందారోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కమిటీల ఓటింగ్‌తో రాష్ట్ర కమిటీని పునర్ వ్యవస్థీకరించాలనే ప్రతిపాదనను కొత్తగట్టు శ్రీనివాస్ ససేమిరా వద్దన్నారని తెలిపారు.

ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు నీరటి రాజు, సింగారపు రామకష్ణ, కూతురు రాజు, బరిగెల భాస్కర్, బోనాల రమేష్, పెండ్యాల కష్ణ, ఆకుల సుభాష్, అమ్మగారి శ్యామ్, పిట్టల రమేష్, రుక్మాకర్, పడిగె మహేందర్, పుట్ట మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

రాష్ట్రంలోని వికలాంగులకు అండగా నిలిచి ఆదుకుంటామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం ఆధ్వర్యంలో మహబూబ్ బాద్, వరంగల్ పార్లమెంట్ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అసెంబ్లీ ఇంఛార్జి లు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌ల సమావేశం జరిగింది. హాజరైన మీటింగ్ కి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కాంగ్రెస్‌పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య హాజరై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు లు అందరినీ కలుపుకొని ఉమ్మడి వరంగల్ జిల్లా వికలాంగులకుసంక్షేమానికి, 6గ్యారంటీలు వికలాంగులకు అందడానికి కృషి చేస్తామన్నారు.

కార్యక్రమంలో వికలాంగుల నాయకులు బోట్ల సురేష్, కాంగ్రెస్ వికలాంగుల విభాగం ఇంచార్జిలు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ లు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి 'హెల్పింగ్ హాండ్స్' చేయూత

నవతెలంగాణ-పర్వతగిరి

మండలం లోని ఏనుగల్ లో అనారోగ్యం తో చెట్టబోయి న సాంబయ్య మంగళవారం మృతిచెందగా హెల్పింగ్ హ్యాం డ్స్ అనే గ్రూప్‌ద్వారా బుధవారం వరకు సేకరించిన రూ.50 వేలు మృతుడు సాంబయ్య కుమారుడు చెట్టబోయిన మైభూ రాజుకు కుల పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడ నరేందర్ వర్మ, హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-పర్వతగిరి

ఉమ్మడి గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ,ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశం కొరకై దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నామని వరంగల్ జిల్లా సమన్వయ అధికారి, పర్వతగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. సమ్మయ్య బుధవారం తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు 2024 జనవరి 6 వరకు 2023-24లో నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఆర్‌డిఎఫ్ విద్యార్థి

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని కల్లెడ ఆర్‌డిఎఫ్ - వనిత అచ్యుతాపాయి విద్యాలయ జూనియర్ కళాశాలలో సిఇసి రెండవ సంవత్సరం చదువుతున్న టి.సాయిచరణ్ వరంగల్‌లోని పోతన విజ్ఞాన పీఠంలో జరిగిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో జీవనై పుణ్య విభాగంలో కథా రచన డిక్లమేషన్స్ పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారు. బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్ ఎ.జనార్థన్, వైస్ ప్రిన్సిపల్ రాజు, ఎఓ ఏకాంబరం, శ్రీలత, శ్రీరామమూర్తి, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్, దేవేందర్, గొర్లఅశోక్, రమేష్, అనిల్, నాగరాజు, విజయేందర్ అభినందించారు.

## అయ్యప్ప దేవాలయంలో కుంబాభిషేకం

నవతెలంగాణ-నర్సంపేట

అయ్యప్ప దేవాలయంలో ద్వితీయ పుష్కర కుంభాభిషేకం నిర్వహించారు. బుధవారం ఆల య కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్త, రజనీ ఆధ్వ ర్యంలో 23వ మండల పూజ మహోత్సవంలో ఆలయ ద్వితీయ పుష్కర కుంభాభిషేకం యాగాన్ని చేపట్టారు. ఆలయ వేద పండితులు శ్రీమాన్ బ్రహ్మశ్రీ సీ.వెంకటేష్ శర్మ పూజ నిర్వహణలో గర్భ గుడిలోని అయ్యప్ప స్వామికి పూజలు చేశారు. ప్రధాన పడిమెట్ల ముందు కలిశాభిషేక పూజలో 40 దంపతులు పాల్గొనగా ఆలయ నియ అర్చకులు దేవిష్ మిశ్రా ప్రధాన జ్యోతులు వెలిగించి గణపతి పూజతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మించిర్యాల జిల్లా అచలాపూర్ గ్రామవేద పాఠశాల నుంచి 11మంది వేద పండితులు సుబ్రహ్మణ్యం, మణిశంకర్‌శర్మ, సంతోష్ శర్మ, ఓంకార్ వర్మ, సుహాస్ శర్మ, ఆలయ కార్యవర్గ సభ్యులు మాదరాపు చంద్రశేఖర్, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, చింతల కరుణాకర్ రెడ్డి, శ్రీరాముల శంకరయ్య, వంగేటి గోవర్ధన్, మాదారపు రవీందర్, ఇరుకుల వీరలింగం, పిన్న రామానం దం భూపతి లక్ష్మీనారాయణ, శింగిరికొం వేణుగోపాల్, పాల కుర్తి శ్రీనివాస్; దొడ్డ వేణు, మల్యాల రాజు, ఆకుల ప్రభాకర్, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గురుస్వాములు పాల్గొన్నారు.



## ఉచిత నేత్ర వైద్య శిబిరం

తెలంగాణ-గీసుగొండ

మండలంలోని చంద్రయ్యపల్లి గ్రామంలో శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ ఆకుల స్రవంతి రుద్రప్రసాద్ మాట్లాడుతూ ఉచిత కంటి శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఆస్పటల్ వారికి ధన్యవాదాలు తెలిపారు, కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# 'శ్రీచైతన్య' చైర్మన్ సురేందర్‌గౌడ్‌ను కఠినంగా శిక్షించాలి

- ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.రత్నమాల



నవతెలంగాణ-హనుమకొండ

శ్రీచైతన్య జూనియర్ కాలేజ్ విద్యార్థినులపై జరిగిన లైంగిక దాడిని తీవ్రంగా ఖండిస్తూ చైర్మన్ బూర సురేందర్ గౌడ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హన్మకొండ అంబేద్కర్ సర్కిల్ వద్ద ఐద్వా అధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాని కి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఆర్.జయశ్రీ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐద్వా రాష్ట్ర సహాయకార్యదర్శి ఎస్.రత్నమాల మాట్లాడుతూ శ్రీచైతన్య జూనియర్ కళాశాల చైర్మన్ బూర సురేందర్‌గౌడ్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడటమనేది చాలా దుర్మార్గమైన సంఘటన ఐద్వా దీనిని తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆడపిల్లలకు చదువుతో పాటు విజ్ఞానం నేర్పాల్సిన గురువులే వారిపై లైంగిక వేధింపులకు పాల్పడటం సిగ్గు చేటన్నారు. విద్యవలన సమాజంలో ఆడవారు అన్ని రంగాలలో సమానంగా ఉంటారని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చట్టాలు తీసుకొస్తే కళాశాలలో చదువుతున్న విద్యార్థులను యాజమాన్యమే ఇలా చేయటమనేది చాలా దారుణమన్నారు. కళాశాల చైర్మన్ బూర సురేందర్ గౌడ్‌ను కఠినంంగా శిక్షించాలన్నారు.

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఆర్.జయశ్రీ మాట్లాడుతూ చట్టాలు నామమాత్రంగానే ఉన్నాయని, లైంగిక వేధింపులు చేసిన వారిని ప్రభుత్వాలు వెంటనే కఠినంగా శిక్షిస్తే ఇలాంటి సంఘటనలు జరగకుండా అరికట్టవచ్చన్నారు. బూర సురేందర్ గౌడ్‌ను కఠినంగా శిక్షించకుంటే పెద్దఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామన్నారు.

ఈ కార్యక్రమానికి ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు రామతార, స్వప్న, రమ, శ్రీదేవి, రాజకుమారి, ఉమ, రాధిక, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సమర్ధవంతంగా వార్డుసభలు నిర్వహించాలి : కమిషనర్

- నేటి నుండి వార్డుల్లో అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-వరంగల్

సమర్ధవంతంగా వార్డుసభలు నిర్వహించాలని బల్దియా కమీషనర్ షేక్ రిజ్వాన్‌బాషా అధికా రులు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. బుధవారం వరంగల్ ఐఎంఎ హాల్‌లో బల్దియాఅధికారులు, సిబ్బందికి వార్డు సభల సమర్థ నిర్వహణకోసం ఏర్పాటుచేసిన సమావేశంలో కమీషనర్ పాల్గొని పటిష్ట నిర్వహణకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమాన్ని బల్దియా వ్యాప్తంగా 66 డివిజన్ లలో షెడ్యూల్ ప్రకారం ప్రతీరోజూ దరఖాస్తుల స్వీకరణ రెండు షిఫ్టలలో ఉదయం 8:12 గంటలకు, మధ్యాహ్నం 2నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈ నెల 28 నుండి జనవరి 6 వరకు కొనసాగుతుందని, ప్రతిఇంటి నుండి ఒకే దరఖాస్తు సమర్పించాలన్నారు. నేడు ప్రారం భోత్సవం బల్దియా పరిధిలోని హన్మకొండ జిల్లా పరిధిలోని 4 ప్రాంతాలైన 4వ వార్డు పరిధిలోని యాదవ నగర్ కమ్యూనిటీహాల్, 1వవార్డు పరిధి గుండ్లసింగారం లోని జీపిఆఫీస్, 5వ వార్డు లోని కొత్త రాజు కమ్యూ నిటీ హాల్‌లలో, వరంగల్ జిల్లా పరిధిలో 4 ప్రాంతా లైన 3వడివిజన్ పైడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో 11వ డివిజన్‌లోని బల్దియా ఇండోర్ స్టేడియంలో 12వ డివిజన్ దేశాయిపేటలోని షాది ఖానాలో, 13 వ డివిజన్ శాంతినగర్ లోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో ప్రారంభించుకోడం జరుగుతుందని అన్నా రు. ఇదే తీరుగా ప్రతిరోజూ రెండు జిల్లాలోని వివిధ డివిజన్‌లోని 4 ప్రాంతాల్లో సూచించిన షెడ్యూలు ప్రకారం నిర్వహించడం జరుగుతుందని ఇందులో ప్రజాప్రతినిధులులతోపాటు ఉన్నతస్థాయి అధికారుల పాల్గొంటారని ఈ అవకాశాన్ని బల్దియా వ్యాప్తం గా ఉన్న ప్రజలు సద్వినియోగం చేసుకొని దరఖాస్తులు సమర్పించాలని దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ఉద్యోగులు సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని కమీషనర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, కృష్ణ రావు, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న, బయలజిస్ట్ మాధవ రెడ్డి, డిఎఫ్ఓ శంకర్‌లింగం, డిప్యూటీ కమిషనర్‌లు కృష్ణారెడ్డి, గోడిశాల రవీందర్ తది తరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపాలన' పటిష్టంగా అమలు చేయాలి : ఎంపీపీ

నవతెలంగాణ-ఆత్మకూరు



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న 'ప్రజాపాలన' కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎంపీపీ మార్క సుమలత రజనీకర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్‌లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉద్దేశించి ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయాస్తం ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తులను లబ్ధిదారుల నుండి స్వీకరించాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీ లో ఈనెల 28 నుండి జనవరి 6 వరకు గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులు విధిగా ఉండి ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు స్వీకరించాలని ఎంపీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దార్ సురేష్ కుమార్, సీఐ డి.రవి రాజు, ఎస్సై రాజేష్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

**చెన్నారావుపేట** : ప్రజా పాలన ద్వారా అర్హతగల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ అభివద్ధి ఫలాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఈగల భారతి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాటాడుతూ ప్రజలకు పాలన చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాలను చేపడుతుందన్నారు. నేటి నుండి 2024 జనవరి 6 వరకు మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ వంటి చేయూత పథకాలకు సంబంధిత దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. వంద కుటుంబాలకు కనీసం ఒకకౌంటర్ ఉండేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్, తెల్ల రేషన్ కార్డు జతపరచాలన్నారు. దరఖాస్తుదారునికి తప్పనిసరిగా రసీదు అందించడంతో పాటు రిజిస్టర్లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

**వేలేరు** : మండలంలోని 14 గ్రామాల్లో నేటి నుండి జనవరి 5 వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ లక్ష్మిప్రసన్న తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 28న చింతల తండా బండ తండా, 29న గొల్లకిష్టంపల్లి, లోక్యతండ, 30న పీచర, వేలేరు, జనవరి 2న ఎర్రబెల్లి, మల్లికుదుర్ల, 3న కమ్మరిపేట్, గుండ్ల సాగర్, 4న షోడశపల్లి, కన్నారం, 5న శాలపల్లి, మద్దెలగూడెం గ్రామాల్లో ప్రజాపాలన-ప్రజావాణి కా ర్యక్రమాలు జరగనున్నాయని వీటిని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

## మెపా రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నుకున్నారు. మెపా రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రేగుల మొగిలి, కోశాధికారిగా పెండెం మధుసూదన్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కొత్త గట్టు శ్రీనివాస్, రేగుల మొగిలి మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ముదిరాజులు ముందుండాలంటే బీసీ రిజర్వేషన్లలో ముదిరాజులను బిసిడి నుంచి బీసీ ఏలోకి మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

ఈ కార్యక్రమంలో కట్లా శ్రీనివాస్, అల్లం వేణుమాధవ్, బోలబోయిన రమాదేవి, బుర్ర సంపత్, ఆశ, ముప్పిడి ఐలేష్, కొత్తగట్టు స్వామి, రేగుల సహదేవ్, కొత్తగట్టు సంగీత కళ్యాణ్, కాటం రమేష్, సాంబరాజు, జిల్లా, మండల, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రైతుబంధు వెంటనే జమ చేయాలి

నవతెలంగాణ-నడికూడ

రైతుబంధు సాయం రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కిషన్ రావు మాట్లాడుతూ త్వరలోనే యాసంగి సీజన్ కోసం రైతుబంధు సహాయం అందుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారని కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లింపు చేయకపోవడంతో రైతులు దిక్కు తోచని పరిస్థితులలో పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

## యువత అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

యువత విద్యా, ఉద్యోగ, రాజకీయ, క్రీడారంగాల్లో రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ అన్నారు. ఈనెల 30 నుండి జనవరి 2 వరకు నల్గొండ జిల్లాలో జరగనున్న 6వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ నెట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనే బాలబాలికల ఎంపికలు జేఎన్ఎస్‌లో బుధవారం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మొహ్మద్ అజీజ్‌ఖాన్ హాజరై మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములను క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని, యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ బిన్నీ లక్ష్మణ్, నెట్‌బాల్‌ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కందుల సజన్ కాంత్, ప్రధాన కార్యదర్శి సూర్యారావు, తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ లిల్లీ ఫ్లోరెన్స్, ఉపాధ్యక్షులు జూలూరి రంజిత్ గౌడ్, కార్తీక్ సింగ్, రంజిత్, సాజిద్‌పాషా, ఫయాజ్, అల్తాఫ్,హాసన్, కోచ్ వెంకటేష్, రాకేష్,అఖిల్,రఘు,రాజు, సాయికుమార్ తదతరులు పాల్గొన్నారు.

## అనంత మల్లయ్యకు నాయిని నివాళి



నవతెలంగాణ-కాజీపేట

కాజీపేట శ్వేతార్క మూల గణపతి దేవాలయ వ్యవస్థాపకులు అనంత మల్లయ్య సిద్ధాంతి అనారోగ్యంతో హైదరాబాదులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో గత కొద్ది రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మరణించరు,ఇట్టి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బుధవారం ఉదయం అనంత మల్లయ్య సిద్ధాంతి భౌతికాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, సయ్యద్ విజయ శ్రీ రజాలి, మాజీ కార్పొరేటర్లు సుంచు అశోక్, గుంటి కుమారస్వామి, మహమ్మద్ అంకుష్ పాల్గొన్నారు.

## గణితంపై విద్యార్థులు పట్టుసాధించాలి

నవతెలంగాణ-చెన్నారావుపేట

గణితంపై విద్యార్థులు పట్టు సాధించాలని హైస్కూల్ ఇంచార్జి హెచ్ఎం ఎ. ఉమారాణి అన్నారు. బుధవారం మండల పరిధిలో మండల స్థాయి గణిత ప్రతిభ పోటీలను గణిత ఫోరం ఉపాధ్యాయుల అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉమారాణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ గణితం పట్ల విద్యార్థులకు పూర్తి అవగాహన కలిగి గణిత ప్రతిభా పోటీలలో పాల్గొని గణితం పై పట్టు సాధించాలని విద్యార్థులు కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, రజిని, సుధాకర్, రజిత, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, సిఆర్పీ లు సంపత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి




నవతెలంగాణ-వర్ధన్నపేట

విద్యార్థులు చదువులతోపాటు క్రీడలలో రాణించాలని ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అన్నారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో జరిగిన రాష్ట్ర, జాతీయస్థాయి 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ 2023-24 క్రీడల్లో ఏకశిల విద్యార్థులు వారి క్రీడానైపుణ్యాన్ని చాటారు. మంచిర్యాలలో నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఐనవోలు మండలం, ఖమ్మం హైవేలోని ఏకశిల సీబీఎస్ఈ, స్టేట్ స్కూల్స్ కి చెందిన 8వ తరగతి విద్యార్థి జి.సామ్యుల్ జాన్ అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి మొదటి బహుమతిని గెలుచుకోగా, 9వ తరగతికి చెందిన జి.హస్విత ద్వితీయ స్థానం సాధించిందని, వీరు త్వరలో న్యూ డిల్లిలో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటున్న సందర్భంగా బుధవారం పున్నేలు క్రాస్ వద్ద గల ఏకశిల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి విజేతలతో పాటు రంగారెడ్డి జిల్లాలోని స్పీడ్ బ్యాడ్మింటన్ అకాడమీ కొత్తపేటలో నిర్వహించిన బ్యాడ్మింటన్ ఆటలో అండర్-17 విభాగంలో 8వ తరగతికి చెందిన సిహెచ్.హన్సిక జిల్లా స్థాయిలో తతీయ స్థానం సాధించగా, మహబూబ్ నగర్‌లోని బడేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 17 ఏళ్ల విభాగంలో జరిగిన ఫుట్‌బాల్ క్రీడలో ముగ్గురు, కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 14 ఏళ్ల విభాగంలో జరిగిన హాకీ క్రీడలో ఇద్దరు, వనపర్తి జిల్లాలో బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో జరిగిన హాకీ అండర్-17లో ముగ్గురు, రంగారెడ్డిలోని ఇబ్రహీం పట్నం గురుకుల్ విద్యార్థి పీఠంలో అండర్-14 నెట్ బాల్‌లో తొమ్మిది మంది, అండర్-17లో ఏడుగురు, కేయూ హన్మకొండలో జరిగిన సాఫ్ట్ బాల్ ఆటలో అండర్-14లో ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయిలో గెలిచి, రాష్ట్ర స్థాయి క్రీడలకు వెళ్లారని చెప్పారు.అనంతరం విజేతలను మెమొంటోలతో అభినందించి, వ్యాయామ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్మిన్ ఇన్‌చార్జ్ ఎండి.బాబా, వైస్ ప్రిన్సిపాల్ కూనూరు రవి కిరణ్, నర్సయ్య, పాలకుర్తి నరేష్, రవీందర్, రజినీకర్, రాజేష్, ప్రేమ్,శిరీష, అనూష ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా మత్స్య సహకార సంఘం అడహక్ కమిటీ అధ్యక్షుడుగా మల్లేశం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

హనుమకొండ జిల్లా మత్స్య సహకార సంఘం అడహక్ కమిటీ అధ్యక్షుడుగా బుస్సా మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా మత్స్య సహకార సంఘం కమిటీ సర్వసభ్య సమావేశం మత్స్య సహకార శాఖ జిల్లా అధికారిణి విజయ భారతి ఆధ్వర్యంలో బుధవారం హన్మకొండ అలంకార్ జంక్షన్‌లోని గంగా గార్డెన్‌లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా శాసనసభ మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ హాజరుకాగా నూతన జిల్లా అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా మత్స్య సహకార సంఘం అడహక్ కమిటీ అధ్యక్షుడుగా బుస్సా మల్లేశం, ప్రమోటర్లుగా శీలం పద్మ, రాంబాబు, జగదీష్ , మొగిలి, పల్లెబోయిన శ్రీనివాస్, బయ్య తిరుపతి, గండి రాజమౌళి, దువా నవీన్, సుధాకర్, సత్యనారాయణ ఎన్నికయ్యారు. అధ్యక్షుడుగా ఎన్నికైన బుస్సా మల్లేశం ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మూడు పర్యాయాలు, అధ్యక్షుడిగా మూడుపర్యాయాలు పనిచేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ మత్స్య సహ కార సంఘం బలోపేతానికి అహర్నిశలు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

## కన్నుల పండువగా ఆరుద్రోత్సవం

నవతెలంగాణ-మట్టెవాడ



చరిత్ర ప్రసిద్ధిగాంచిన స్టేషన్ రోడ్డులోని శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆకారపు గుడిలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఆ రుద్రోత్సవం బుధవారం భక్తుల కన్నుల పండుగగా జరిగింది. ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఆకారపు హరీష్ స్వాతి దంపతులఆధ్వర్యంలో అర్చకులు లంక శివకుమార్ శర్మ నేతృత్వంలో కాశీవిశ్వేశ్వర స్వామికి అభిషేకాలు, పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎస్ వెంకట్రావు, పూజారి జగన్మోహన్ శర్మ, నాగలక్ష్మి, జానకి దేవి, సునీత, విజయ, శార్వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## జీరాక్స్ సెంటర్లో లభించే ఫారాలు చెల్లవు



**నవతెలంగాణ-బచ్చన్నపేట**

ప్రజాపాలనలో ధరఖాస్తులకు జీరాక్స్ సెంటర్లో లభించే ఫారాలు చెల్లవని ప్రభుత్వం ఇచ్చే ఫారాలలోనే తమకు సంబంధించిన కుటుంబాల వివరాలు నమోదు చేసి ఇవ్వాలని మండల స్పెషల్ ఆఫీసర్ వినోద్ కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అధికారుల ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్దనే ప్రభుత్వం అందచేస్తున్న పథకాల ఫారాలు అందుబాటులో ఉంటాయన్నారు. లబ్దిదారులు ఆందోళన చెందద్దని, ఆ ఫారాలను అధికారులకు అందజేయాల్సి ఉంటుందన్నారు. రేషన్ కార్డు పూర్తిగా లేనివారు తన వివరాలను వ్రాసి ప్రత్యేక కౌంటర్ల ఇవ్వాల్సి ఉంటుందన్నానారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీపీ నాగజ్యోతి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి

- **టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇంచార్జి సింగపురం ఇందర**



**నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్**

ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజక వర్గ ఇంచార్జీ సింగపురం ఇందిర అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తెలం గాణ ప్రదేశ్ కమిటీ, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తుక్కుగూడ సభలో ప్రజలకిచ్చిన ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారెంటీలను ఇచ్చి, రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నదని, మరో వంద రోజుల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. నేటి నుంచి అధికారిక ప్రకటనలో భాగంగా ప్రజా పాలన గ్రామ సభలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సింగపురం ఇందిర పిలుపు నిచ్చారు.



## కాంగ్రెస్ హామీలు మోసపూరితం

- **స్థానిక సంస్థల, లోకసభ ఎన్నికల్లో కష్టపడి పని చేయాలి**
- **స్టేషన్‌ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**నవతెలంగాణ-జఫర్‌గఢ్**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసి, అధికారం కోసమే మోసపూరిత హామీలు కాంగ్రెస్ ఇచ్చిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయిసమావేశం, కృతజ్ఞత సభ మండలాధ్యక్షుడు పల్లెపాటి జయపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశంనిర్వహించారు. ముఖ్య అతిథిగా కడియం శ్రీహరి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పదవుల కోసం ఆరాటం తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోదని ఎద్దేవ చేశారు. 412 హామీలలో రెండు హామీలు కూడా అమలు చేయని కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలు ఎలా అమలు చేస్తుందో వేచిచూడాలన్నారు.ప్రతిపక్షంలో మనం బలంగా ఉన్న ప్రతీ సమస్యను, ప్రశ్నించే తత్వం మనకు ఉందన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, మొదటగా మహిళలకు ఉచిత ప్రయాణం అంటూ మొదటి గ్యారంటీలో ఒకటి నెరవేర్చి, రెండో గ్యారెంటీ ఆరోగ్యశ్రీకి 10 లక్షల హామీ టిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే అమలైందని, ప్రజా పాలన కాలయాపన కోసమే తప్ప మరొకటి లేదన్నారు. డిసెంబర్ 9న కాంగ్రెస్ అధికారులకు రాగానే రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు స్పష్టంగా హామీ ఇచ్చాడు, ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. రైతుబంధు 15000 ఇస్తామన్న రైతు బంధు ఎకరం పైబడిన రైతులకు నేటికీ జమ కాలేదని, ఇంకెప్పుడు ఇస్తారన్నారు. రానున్న రోజుల్లో టిఆర్ఎస్‌కు పూర్వవైభవం తీసుకొచ్చి స్థానిక సంస్థల్లో లోకసభలో సత్తాచాటాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి, గుజ్జారి రాజు, భానోత్ రాజేష్ నాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



### గ్రామ సభల విజయవంతానికి...

## సమన్వయంతో పనిచేయాలి

- **నియోజకవర్గ ప్రత్యేక అధికారి రంగాచారి**

**నవతెలంగాణ-పాలకుర్తి**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామ సభలను విజయవంతం చేసేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని పాలకుర్తి నియోజకవర్గం ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి సూచించారు.బుధవారం మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గం మండలఅధికారులు, ప్రజా ప్రతినిధులతో ప్రజా పాలన గ్రామసభల అవగాహన శిక్షణ కార్యక్రమంలో రంగాచారి మాట్లాడారు. ప్రజాపాలన గ్రామసభలో అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలోని ఒక్కో మండలానికి రెండు నుండి మూడు బృందాలుగా ఏర్పాటు చేశామని, ప్రజా పాలన గ్రామసభల సందర్భంగా ప్రజల నుండి వచ్చే దరఖాస్తులను స్వీకరించేందుకు కౌంటర్లను ఏర్పాటు చేశామని, మండల స్థాయి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామసభల నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజా పాలన గ్రామసభలో ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా పాలన గ్రామసభల విజయవంతం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జిల్లా కో ఆప్షన్ సభ్యులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

**నవతెలంగాణ-రఘునాథపల్లి**

మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను స్టేషన్‌ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం పరామర్శించారు. నిలిగొండ గ్రామంలో ఇటీవల మరణించిన మాసంపల్లి పుల్లాజీ, మారపాక యాదగిరి తల్లి లింగమ్మ కుటుంబాన్ని, బానాజీపేట గ్రామానికి చెందిన మాటూరి రమేష్ కుటుంబ సభ్యులను, వార్డు సభ్యులు కాసర్ల నరసయ్య కుటుంబాన్ని, చెరుకు యాదగిరి భార్య వీరలక్ష్మి కుటుంబాన్ని, కన్నాయపల్లి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ నాయకులు భైరగోని సిద్దులు తండ్రి సాంబయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మారుజోడు రాంబాబు, మండల కోఆర్డినేటర్ రవి, శ్రావణ్ కుమారు, గైన శీను, బాలరాజు, ఆంజనేయులు, వెంకటరెడ్డి, బాబురావు, కడియం శ్రీహరి యువసేన మండలాధ్యక్షులు వడ్లకొండ శివప్రసాద్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు సేవలాల్ ట్రస్ట్ చేయూత

**నవతెలంగాణ-పాలకుర్తి**

మండలంలోని గుడికుంట గ్రామపంచాయతీ తండాకు చెందిన కునుసోతు పూజ నాయక్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే మృతి చెందడంతో బుధవారం సేవాలాల్ మహారాజ్ ధర్మ పరిరక్షణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థికంగా చేయూత నిచ్చారు. ట్రస్ట్ చైర్మన్ బానోతు మహేందర్ మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు ట్రస్టు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఆర్థిక సహాయంతో పాటు బియ్యం, నిత్యవసర సరుకులను బాధితుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వీరేశ్ నాయక్, భూక్యా శ్రీను నాయక్, భూక్యా వెంకట్ నాయక్, జాటోత్ రాహుల్ నాయక్, లకావత్ నాగరాజు నాయక్, లకావత్ వెంకట్ నాయక్, లకావత్ సురేష్ నాయక్, గుగులోత్ నర్సింహా నాయక్, కునుసోత్ విజయ్ నాయక్, జాటోత్ రాము నాయక్, సర్పంచ్ బానోత్ క్రాంతి-యాకుబ్ నాయక్, బానోత్ టాక్రు నాయక్, బానోత్ దేవా నాయక్, బానోత్ బాలోజీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



### రెండో విడత అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు...

# ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలి

- **సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి**



**నవతెలంగాణ-జనగామ**

అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత లబ్దిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం గృహలక్ష్మీ పథకం ద్వారా రూ.5 లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జనగామ పట్టణ సమీపంలోని ఐదవ వార్డులోని 2బిహెచ్‌కే,ఏసిరెడ్డి కాలనీల్లో బుధవారం సీపీఎం పార్టీ పట్టణ కమిటీ సమావేశం బోట్ల శ్రీనివాసు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఎం మోకు కనకారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కనుకారెడ్డి మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వం జనగామ పట్టణ కేంద్రంలో ఎల్లముల రోడ్డులోని బాణాపురంలో పేద ప్రజలకు ఇందిరమ్మ రెండవ మూడో విడతలో ఇచ్చిన ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉందన్నారు. అప్పులు తెచ్చి సగం సగం ఇల్లు కట్టి అసంపూర్తిగా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తయిన ఇళ్లల్లో రోడ్డు, కరెంటు లేక అసంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయన్నారు.తక్షణమే గృహలక్ష్మి పథకం కింద ఐదు లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెడుతుందని ప్రజలు ఆశల పల్లకిలో ఉన్నారు. అప్పై చేసుకున్న వారందరికీ ఐదు లక్షల రూపాయలు రుణమిచ్చి ఇండ్లు పూర్తి చేయించాలని కోరారు. లేని పక్షంలో ప్రజల్ని సమీకరించి భవిష్యత్తులో ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడం కోసం ఉద్యమాలు చేపడతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, ఎండి అజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు పందిళ్ళ కళ్యాణి, పల్లెర్ల లలిత, కళ్యాణ లింగం, బొట్ల శ్రావణ్, దూసరి నాగరాజు, శాఖ కార్యదర్శులు చీర రజిత, గాడి సుభాషిని, శివరాత్రి హేమలత, బుడ్డ రూబేను, తాళ్లపల్లి పోసెల్లి తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలే కాంగ్రెస్ ప్రజా పాలనకు నాంది

- **పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**



**నవతెలంగాణ-పాలకుర్తి**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేయనున్న ఆరు గ్యారెంటీలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పలనకు నాంది అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ప్రకటించిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 6 గ్యారంటీల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టారని, ఉన్నత స్థాయి అధికారులతో ప్రణాళికను సిద్ధం చేశారని తెలిపారు.ఆరు గ్యారెంటీలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజులకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీని 10 లక్షలకు పెంచామని తెలిపారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజా పాలనలో భాగంగా గ్రామసభలను ఏర్పాటు చేశామని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఆరు గ్యారెంటీలు అందే విధంగా ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నేటి నుండి 2024 జనవరి 6 వరకు ప్రజా పాలన గ్రామసభలు నిర్వహిస్తుందని తెలిపారు. గత పాలకులు పథకాల పేరుతో అప్పులు చేసి రాష్ట్రాన్ని నాశనం చేశారని, అర్హులైన ఏ ఒక్కరికి పథకాలు అందలేదన్నారు. ప్రజా సంక్షేమం కోసమే ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనకు శ్రీకారం చుట్టిందని, ప్రజలకు పాలన అందుబాటులో ఉండే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన గ్రామసభలను ఏర్పాటు చేసి, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులను నియ మించిందని తెలిపారు. ప్రజాపాలన గ్రామసభలను పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకొని, విజయ వంతం చేసేందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతి నిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

# ప్రజా పాలన దరఖాస్తులకు ఆధార్, రేషన్ కార్డు తప్పనిసరి

- **దరఖాస్తుల స్వీకరణకు 143 కౌంటర్లు**
- **నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**
- **పాలకుర్తి మండల ప్రత్యేక అధికారి, డిఆర్‌డిఓ పిడి మొగులప్ప**



**నవతెలంగాణ-పాలకుర్తి**

ప్రజాపాలన గ్రామసభలో లబ్దిదారులు చేసుకునే దరఖాస్తులకు ఆధార్, రేషన్ కార్డు జిరాక్సు తప్పనిసరిగా జతచేయాలని మండల ప్రత్యేక అధికారి డిఆర్‌డిఓ పిడి మొగులప్ప స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామ అవగాహన కార్యక్రమంలో మొగులప్ప మాట్లాడుతూ మండలంలో 36 గ్రామపంచాయతీలకు మూడు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజా పాలనలో లబ్దిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించేందుకు 36 గ్రామపంచాయతీలలో 143 కౌంటర్లను ఏర్పాటు చేశామని, గ్రామసభలో కుటుంబ యజమాని మాత్రమే దరఖాస్తు చేయాలని, దరఖాస్తు చేసే లబ్దిదారుని ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌లు జత చేయాలని, ఫోన్ నెంబర్‌తో పాటు పాస్ ఫోటో అంటించాలని, కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లు దరఖాస్తులో పొందుపరచాలని తెలిపారు. ప్రజా పాలన గ్రామసభలు విజయవంతంగా జరిగేందుకు పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో దండోరాతో పాటు ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. 100 కుటుంబాలకు ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేసిన అదనంగా మరో కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. లబ్దిదారులకు గ్రామ సభల ద్వారానే ప్రభుత్వం దరఖాస్తులు అందజేస్తుందన్నారు. మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకోవాలని, మండలంలోని గ్రామాలకు వరుస క్రమంలో నంబర్లు కేటాయించాలన్నారు. ఐదు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను ప్రజా పాలన కౌంటర్లలో, అభివృద్ధి సంక్షేమాలకు సంబంధించిన దరఖాస్తులను లిఖితపూర్వకంగా జనరల్ కౌంటర్లలో తీసుకుని రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. జనవరి 6 వరకు గ్రామాల్లో అందుబాటులో అధికారులు ఉంటారని, దరఖాస్తు చేసుకునే లబ్దిదారులు ఆందోళన చెందవద్దన్నారు. రోజుకు మూడు బృందాలుగా 6 గ్రామాల్లో ప్రజా పాలన గ్రామసభలు నిర్వహిస్తారని, గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వనపర్తి అశోక్ కుమార్, తహసిల్దార్ తీరందాస్ వెంకటేశం, ఎంపీఓ రవికుమార్, మహిళా శిశు సంక్షేమ అధికారి జయంతి పాల్గొన్నారు.



## శ్రద్దగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : రాపోలు శేషారెడ్డి

**నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్**

విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రోటరీ క్లబ్ బాధ్యులు రాపోలు శేషారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తాటికొండ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 22మంది విద్యార్థినులకు రోటరీ క్లబ్ సహకారంతో సైకిళ్లు పంపిణీ చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు కౌడ రాజేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శేషారెడ్డి మాట్లాడుతూ గ్రామాల నుండి సరైన రవాణా సౌకర్యంలేక విద్యార్థులు కొందరు చదువుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రోటరీ క్లబ్ బాధ్యులు బాలికల సౌకర్యార్థం 22 సైకిళ్ళను పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుతో పాటుగా వ్యాయామం, ఆటపాటల్లో రాణించాలని ఆకాంక్షించారు. సైకిళ్ళను బహుకరించిన రోటరీ క్లబ్, తాటికొండ గ్రామ వాస్తవ్యులు రాపోలు శేషారెడ్డికి పాఠశాల ఉపాధ్యాయ, విద్యార్థి బృందం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## కుల అభివృద్ధి సంఘటితంతోనే సాధ్యం

- **టీపీసీసీ కార్యదర్శి ముత్తినేని వీరయ్య**

**నవతెలంగాణ-బచ్చన్నపేట**

కుల అభివృద్ధి సంఘటితంతోనే సాధ్యం అని టీపీసీసీ కార్యదర్శి వీరయ్య అన్నారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పెరిక సంఘ కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. జిల్లా కేంద్రంలో స్థల సేకరణలో తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే స్థల సేకరణ తర్వాత భవన నిర్మాణం చేపట్టేందుకు కూడా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్తినేని ఉపేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్ జనగామ జిల్లా అధ్యక్షులు ముత్తినేని వెంకటరమణ, యూత్ అధ్యక్షులు మల్యాల హరినాథం, శ్రీధర్, దిలీప్ పాల్గొన్నారు.

## పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం



**నవతెలంగాణ-మరిపెడ**

మండలంలోని గుండెపుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13 సంవత్సరాలుగా పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములై పదోన్నతి పై మెదక్ జిల్లా జెడ్పీఎస్ఎస్ రంగంపేట పాఠశాలకు వెళ్లిన కుడితి ఉపేందర్ రెడ్డికి ఘన సన్మానం చేశారు. బుధవారం జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్.మురళీ కృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు సర్వసాధారణమని, ఉపేందర్రెడ్డి నడిపించిన అభివృద్ధి బాటలోనే తాను పాఠశాల నడిపిస్తానన్నారు. 2001 సంవత్సరంలో గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల మాత్రమే రెండు తరగతులు ఉండేదని, నేడు ఆయన పాఠశాలకు వచ్చిన తర్వాత రెండు అంతస్తుల భవనం, కంప్యూటర్ ల్యాబ్, డైనింగ్ హాల్, డయాస్, పచ్చని మొక్కలతో పాఠశాల వాతావరణ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం కుడితి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ పనిచేసేంతకాలం గ్రామస్తులు మంచి సహాయ సహకారాలు అందించారని, వారి సహాయ సహకారాలను ఎప్పటికి మర్చిపోనన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సూరబోయిన ఉప్పలయ్య, రేఖ శ్రీను, పెద్దపులి శీను, లింగాల మహేష్ గౌడ్, బోడపట్ల సతీష్, బింగి రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు సరోజ, కల్పన, దత్త ప్రసాద్, రవి, పవన్, శ్రీను, రాజు, మహేశ్వరి నామ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలైకి తరలిన అయప్ప భక్తులు

**నవతెలంగాణ-లింగాలఘనపురం**

మండల కేంద్రానికి చెందిన అయప్ప స్వామి భక్తులు 41 రోజు మండల దీక్ష చేసి ఇరిముడి కట్టు కొని బుధవారం భక్తులు శబరిమలైకి తరలి వెళ్లారు. అయప్ప స్వాములు ఆంజయ్య, ప్రవీణ్, వెంకటేష్, సత్యనారాయణ, భాస్కర్, యాదగిరి, రాజు, యాకు, అయిలయ్య సంతోష్, స్వామి, మల్లేశం, భాస్కర్‌లు ఉన్నారు.



**తండ్రి కొడుకును భుజాలపై ఎత్తుకొని పోతుండగా పిల్లవాడు పైనుండే సెల్‌ఫోన్‌తో ఆడుకుంటున్నాడు. ఈ సంఘటన చూసి స్థానిక ప్రజలందరూ ఆశ్చర్యంతో నవ్వుకున్నారు. ఈ విచిత్ర పరిస్థితి 'నవతెలంగాణ' పాలకుర్తి రూరల్ రిపోర్టర్ కెమెరాలో బంధించాడు.**



## ప్రజాపాలన గ్రామసభలను కట్టుదిట్టంగా నిర్వహించాలి : అదనపు కలెక్టర్ సుహాసిని

**నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్**

రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా పాలన గ్రామసభల్ని కట్టుదిట్టంగా నిర్వహించి, అధికారులు బాధ్యతగా పనిచేయాలని అదనపు కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ రామ్మూర్తి, జెడ్పీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ మారపాక రవి, జిల్లా పంచాయితీ రాజ్ అధికారి చంద్రశేఖర్ సూచించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపీపీ కందుల రేఖ అధ్యక్షతన ప్రజా పాలన గ్రామ సభలపై బుధవారం నియోజక వర్గ స్థాయి తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిలుగా వారు మాట్లాడుతూ గ్రామసభలు ఏర్పాటు చేసే స్థలంలో టెంట్లు, కుర్చీలు, లైట్లు, త్రాగునీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు ప్రధాన బాధ్యత వహించాలని, 28నుంచి జనవరి 6వరకు తప్పనిసరిగా దరఖాస్తులు స్వీకరించాలన్నారు. దరఖాస్తు దారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలని, ఒక కుటుంబంలో ఒక్కరు దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందన్నారు. ప్రజా పాలన గ్రామ సభలకు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఏదైనా సమస్యలుంటే, హెల్ప్ డెస్క్ సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ మారపాక రవి, ఎంపీపీలు కందుల రేఖ, మేకల వరలక్ష్మి, చిట్ల జయశ్రీ, వివిధ మండలాల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన నిర్వహణకు సర్వం సిద్ధం

- **అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్**

**నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం నిర్వాణ కోసం జిల్లా వ్యాప్తంగా సర్వం సిద్ధం చేసినట్లు అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ తెలిపారు. జిల్లా అధికారులతో తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణ కోసం నియోజకవర్గానికి, మండలానికి, గ్రామస్థాయికి ప్రత్యేక అధికారులను నియమించి, కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గ్రామాల్లో, పట్టణంలో దరఖాస్తు తీసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఆడవారికి, మగవారికి వేరువేరుగా క్యూ లైన్లు సిద్ధం చేశామని, దరఖాస్తులు అందజేయడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టెంట్లు, కుర్చీలు, త్రాగునీరు సకల సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాలలో, పట్టణంలో ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజలకు విస్తృత ప్రచారం కలిగించేందుకు సోషల్ మీడియా, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించామని వివరించారు. ఇంచార్జ్ అదనపు కలెక్టర్ సుహాసిని, ప్రజాపాలన ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన నియోజకవర్గం సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు.అంతకుముందు లింగాలగణపురం మండలం నెల్లుట్ల గ్రామపంచాయతీ, బచ్చన్నపేట, జనగామ పట్టణం, రఘునాథపల్లి మండల కేంద్రం, లింగాలగణపురంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో డిడబ్ల్యూఓ జయంతి, డిఏవో వినోద్ కుమార్, డిఎం సివిల్‌సప్లై ప్రసాద్, ఉద్యానవనశాఖ అధికారి కేఆర్.లత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ఏర్పాట్ల పరిశీలన

**నవతెలంగాణ-జనగామ**

నేటి నుండి నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించిన నిర్వహణ ఏర్పాట్లను బుధవారం జనగామ మున్సిపల్ పరిధిలోని 2, 27వ వార్డుల్లో అదనపు కలెక్టర్ పర్యటించి పరిశీలించారు. నేటి నుండి నిర్వహించనున్న ప్రజాపాలన సన్నాహక సమావేశాన్ని జనగామ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఇన్చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సుహాసిని, ప్రజా పాలన ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## ప్రతీ దరఖాస్తును స్వీకరించాలి


- **అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్**



**నవతెలంగాణ-లింగాలఘనపురం**

గ్రామ ప్రజల నుంచి వచ్చిన ప్రతీ దరఖాస్తును స్వీకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన గ్రామ సభలపై సమీక్ష సమావేశం ఎంపీపీ చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డి అధ్యక్షత నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి జనవరి 6వ తేదీ వరకు జరిగే ప్రజాపాలన గ్రామ సభలో గ్రామాల్లో ప్రజల నుంచి ఏలాంటి దరఖాస్తు చేసుకున్న దానిని తప్పనిసరిగా తీసుకుని నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారుని వివరాలు పొందుపరచడంతోపాటు ఎంపిడివోకు అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సురేందర్, మండల ప్రత్యేక అధికారి లత, తహశీల్దార్ వినయలత, వివిధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కళాశాల విద్యార్థి మృతి పట్ల సంతాపం



**నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్**

డివిజన్ కేంద్రంలోని జీఎంఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించే ఏ అండ్ టి మొదటి సంవత్సరపు విద్యార్థి కన్నెబోయిన సందీప్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మరణించగా, బుధవారం ప్రిన్సిపాల్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపక బృందం, తోటి విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం

**నవతెలంగాణ-లింగాలఘనపురం**



మండలంలోని నెల్లుట్ల గ్రామంలో 3వ వార్డ్‌లో అండర్ డ్రైనేజ్ పనులు సర్పంచ్ చిట్ల స్వరూప రాణి భూపాల్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింగ ఎల్లాస్వామి, స్థానిక వార్డు సభ్యులు గొరిగే పద్మ, భాస్కర్, కావ్య, రాధిక, సుజాత, యశోద, బచ్చమ్మ, అశోక్,నర్సింహులు, కోఆప్షన్ మెంబెర్ బర్ల అబ్బసాయిలు, నాయకులు బర్ల మైసయ్య, సిద్ధార్థ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ




**నవతెలంగాణ-కేసముద్రం రూరల్**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషన్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ వారి మిషన్ విద్య విజ్ఞాన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ సదస్సు, పాలిటెక్నిక్, ఇంటర్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయులు బి.రాజు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ పరికిపండ్ల అశోక్, ఆత్మీయ అతిథులు, ఫౌండేషన్ డైరెక్టర్స్ బానోత్ నరేష్, ఎన్ఐటి దుర్గాపూర్, జాటోతు జయకృష్ణ, ఐఐటీ రోపార్, ప్రత్యేక అతిథిగా కొలిపాక వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృషి, పట్టుదలతో శ్రమించి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడావత్ మోహన్ ఎన్ఐటి వరంగల్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, ఏ.మధు, సదయ్య చందర్, కృష్ణవేణి, నరసింహా రెడ్డి, కే.శ్రీనివాస్, భద్ర సింగ్, యాదగిరి, జుబేర్ అలీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

## శివాలయం పూజారికి ఆర్థిక సహాయం



**నవతెలంగాణ-గూడూరు**

గూడూరులోని సనాతన శివాలయం పూజారి సతీష్ పాండే 10 నెలల కూతురు శ్రీజి అనారోగ్యంతో ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో పూజారికి 51,016 రూపాయలను ఆర్థిక సాయం బుధవారం స్థానిక అరవింద విద్యాలయంలో అందజేశారు. పూజారి కూతురు ఆరోగ్యం బాగోలేదని తెలుసుకున్న మిత్రులు స్పందించి సేకరించిన అమౌంటును అందజేశారు. శ్రీజ ఆరోగ్యం బాగుండాలని, త్వరగా కోలుకోవాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో మిత్రులు పింగిలి శ్రీనివాస్, కమటం సంతోష్, కల్వాని వేణు మాధవరెడ్డి, మహిపాల్, కట్టయ్య, నర్సయ్యలు పాల్గొన్నారు.



## ఐదు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసుకోండి

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్

**నవతెలంగాణ-మహబూబాబాద్**

ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఐదు గ్యారెంటీల అమలు కోసం ప్రజా పాలన గ్రామసభల ద్వారా లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ కోరారు. బుధవారం మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 23, 24, 25 వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాయా కాలనీలో ప్రజలు తమకు రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలని, మిషన్ భగీరథ కుళాయిలు బిగించాలని, అంగన్వాడి సెంటర్, పీహెచ్సీ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, పింఛన్లు, రేషన్ కార్డులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మురళీ నాయక్ మాట్లాడుతూ గ్రామ సభలో లబ్ధిదారులు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇచ్చిన దరఖాస్తులకు రసీదులు తీసుకుని జాగ్రత్తగా దాచి పెట్టుకోవాలని, దరఖాస్తులపై విచారణ నిర్వహించి అరులైన వారికి ఐదు గ్యారెంటీలు అమలు చేస్తామని తెలిపారు. లెనిన్‌నగర్ అంగన్వాడి సెంటర్లో అంగన్వాడి టీచర్ బిందు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో మురళి నాయక్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ భూక్య ఉమా మురళి నాయక్, యాకయ్య, రాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల్లో వార్డు సభలు : మున్సిపల్ కమిషనర్



**నవతెలంగాణ-మరిపెడ**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 28 నుండి జనవరి 6 తేదీ వరకు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో వార్డు సభలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఏ.రాజు తెలిపారు. బుధవారం వార్డుల్లో సభల సభలో దిశ నిర్దేశాన్ని మున్సిపాలిటీ సిబ్బందికి ఆయన వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తు ఫారంలు ఆయా సెంటర్లలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తీసుకొని, దరఖాస్తులను అందజేయాలన్నారు. ఆయా వార్డుల ప్రకారం వివరాలను ఆయన వెల్లడించారు. 1వ వార్డు దుబ్బ తండా స్కూల్లో, 2వ వార్డులో కస్నా తండా స్కూల్ వద్ద 3వ వార్డు మార్కెట్, ఆడిటోరియంలో, 4వ వార్డులో గోపాల్‌రావుపేట ఎస్టీ హాస్టల్ వద్ద, 5వ వార్డులో లోక్య తండా అంగన్వాడీ స్కూల్ వద్ద, 6వ వార్డులో ఆర్జెఆర్ఎం డిగ్రీ కాలేజ్ వద్ద, 7వ వార్డులో గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద, 8వ వార్డులో కున్యా తండా అంగన్వాడీ స్కూల్ వద్ద, 9వ వార్డులో కార్గిల్ సెంటర్ లోని ఎస్సీ హాస్టల్ వద్ద, 10వ వార్డులో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద, 11వ వార్డులో ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద, 12వ వార్డులో శివాలయం వద్ద, 13వ వార్డులో ప్రభుత్వ జూనియర్ కాలేజి వద్ద, 14వ వారులో సెయింట్ ఆగస్టీన్ స్కూల్ వద్ద, 15వ వార్డులో దక్నాతండా స్కూల్ వద్ద, ఏర్పాటు చేసిన కౌంటర్ల యందు దరఖాస్తులను పట్టణ ప్రజలు తీసుకోవాలన్నారు.

## దొడ్డి కొమురయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

- చిన్న ముప్పారంలో విగ్రహావిష్కరణ

**నవతెలంగాణ-ఇనుగుర్తి**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్యను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని, కురుమలు సంఘటితంగా ఉండి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూరబోయిన యాకయ్య అన్నారు. బుధవారం చిన్న ముప్పారంలో యాదవ యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని సూర బోయిన యాకయ్య అధ్యక్షతన వహించగా డిప్యూటీ కలెక్టర్ వాసం రామ్మూర్తి తల్లి వాసం లింగమ్మ, జిఎన్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, జిల్లా అధ్యక్షులు పయ్యావుల మల్లయ్య, జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ యాదవ యంగ్ స్టార్ యూత్, కురుమ సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉడుత రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ విముక్తి కోసం రజాకారులతో పోరాటం చేసి వారి తూటాలకు బలైన తొలి తెలంగాణ అమరుడు దొడ్డి కొమురయ్య అని గుర్తు చేశారు. ఆయన పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్నారు. కురుమలందరూ సంఘటితంగా ఉంటూ రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ మాట్లాడుతూ తెలంగాణలో భూమి, భుక్తి కోసం పోరాటం చేసి ప్రాణాలు ఆర్పించిన దొడ్డి కొమురయ్య ఆశయాలను ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పయ్యావుల మల్లయ్య, గ్రామ సర్పంచ్ చీకటి ప్రవీణ్, ఎంపీటీసీ కదిరి జగన్, ఇనుగుర్తి ఎస్ గౌరవ అధ్యక్షులు చిన్నాల కట్టయ్య యాదవ్, వల్లముల మురళి, యాదవ గొల్ల కురుమ సంఘం నాయకులు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్



**నవతెలంగాణ-పెద్దవంగర**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమానికి మండలంలో ఏర్పాట్లు పూర్తి అయినట్లు జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా పాలన పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వీరంగటి మహేందర్, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డితో కలిసి మాట్లాడారు. మహాలక్ష్మి, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులు నేటి నుండి స్వీకరిస్తామని చెప్పారు. ఒక్కో కేంద్రంలో నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. నోడల్ అధికారుల పర్యవేక్షణలో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. కాగా షెడ్యూల్ ప్రకారం జనవరి 6 వరకు కొనసాగుతుందని చెప్పారు. వివిధ పథకాల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌తో, పాటుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాట్లు చేశామని, అన్ని ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, మిషన్ భగీరథ ఏఈఈ యాకూబ్ పాషా, ఆర్ఐ భూక్యా లష్కర్, ఏఈవోలు మానస, యశస్విని, అంగన్వాడీ సూపర్వైజర్ కవిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**నవతెలంగాణ-చిన్నగూడూరు**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పగిడిపల్లి సర్పంచ్ శిరీష మంగీలాల్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని పగిడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మధ్యాహ్నం సమయంలో మండల అధికారుల పర్యవేక్షణలో ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోటో తీసుకొని సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

# ఒక కుటుంబానికి ఒకే దరఖాస్తు

- ప్రతీ గ్రామంలో వార్డుల్లో సదస్సులు
- గ్రామ సభల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- జిల్లా కలెక్టర్ కే.శశాంక

**నవతెలంగాణ-మహబూబాబాద్**




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు కోసం చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ కోసం అన్ని గ్రామాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ శశాంక మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను భాగంగా ఐదు పథకాల అమలు కోసం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని 461 గ్రామాలలో 82 మున్సిపల్ వార్డులలో ఈనెల 28 నుండి వచ్చే నెల ఆరో తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం జిల్లాలో గ్రామ సదస్సుల కోసం 40 టీంలు మునిసిపాలిటీలలోని 82 వార్డులలో 9 టీంలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 49 టీంల ద్వారా 98 గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క టీము ఒకరోజు ఉదయం ఒకటి సాయంత్రం ఒకటి చొప్పున రెండు గ్రామసభలు నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు ఒక గ్రామంలో సభ మధ్యాహ్నం రెండు నుంచి ఆరు గంటల వరకు మరో గ్రామంలో సభ నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీలతో పాటు జనవరి నెల రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు తేదీల్లో ఆయా గ్రామాలు మున్సిపల్ వార్డులలో గ్రామసభలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఈ సభలలో అక్కడున్న జనాలకు బట్టి నాలుగు నుంచి ఐదు కౌంటర్‌లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఇచ్చిన దరఖాస్తులకు వెంటనే రసీదు తీసుకోవాలని సూచించారు. గ్రామసభ అయిపోయిన తర్వాత కూడా ఆరో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఈ ఐదు పథకాలతో పాటు అదనంగా ప్రజలు ఇచ్చే దరఖాస్తులను కూడా ప్రత్యేక కౌంటర్ ద్వారా స్వీకరిస్తామని తెలిపారు.

ఇప్పటికే ఆసరా పింఛన్ పొందుతున్న వాళ్లు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు రేషన్, ఆధార్‌కార్డు జిరాక్సు సమర్పించాలని సూచించారు. గ్రామ సభల ప్రాంతాలలో టెంట్లు కుర్చీలు తాగునీరు మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. నిరక్ష్యరాస్యుల కోసం ప్రత్యేకంగా హెల్ప్ చేయడానికి అంగన్వాడి కార్యకర్తలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏ రోజుకు ఆ రోజు కంప్యూటర్లలో ఆన్లైన్ చేయనున్నట్లు కలెక్ట తెలిపారు.

ఈ విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, డిఆర్‌డిఏ పిడి సన్యాసయ్య, జెడ్పీ సీఈవో రమాదేవి, హార్టికల్చర్ అధికారి సూర్యనారాయణ, డిపిఓ హరిప్రసాద్, పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన దరఖాస్తుల్లో సందేహాలు..?!

- అధికారులకు కూడా అంతు పట్టని వైనం
- బ్యాంకు అకౌంట్ అడగని వైనం
- లబ్ధిదారులకు నగదు ఏలా వేస్తారు..?
- అన్ని పథకాలకు రేషన్ కార్డు కొలమానం
- రైతు భరోసా, రేషన్ కార్డు లేకుంటే రానట్లేనా..?



ప్రజా పాలనలో ఉన్న సంక్షేమ పథకాలపై దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తున్నామని అమలుకు సంబంధించిన సందేహాలు రెండవ దశలో పరిష్కారానికి వస్తాయని జిల్లా కలెక్టర్ కె.శశాంక తెలిపారు. కలెక్టరేట్లో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రజా పాలనలో దరఖాస్తుల సందేహాలపై కలెక్టర్‌ను వివరణ కోరగా దాటవేశారు.

**నవతెలంగాణ-మహబూబాబాద్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియపై అయోమయ పరిస్థితులు, లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ వరకు నిర్వహించనున్న ఈగ్రామ సభలో ప్రత్యేకంగా కేవలం 5సంక్షేమ పథకాలు అమలు కోసం మాత్రమే దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్రభుత్వమే స్వయంగా ముద్రించిన దరఖాస్తులో ఐదు పథకాలకు ప్రత్యేకంగా నమూనా ముద్రించారు. ఈ దరఖాస్తులు స్వీకరణకు మాత్రమే అధికారులు రసీదు ఇవ్వనున్నారు. ఇవి కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల కోసం అదనంగా కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ వాటికి రసీదు ఇచ్చే పరిస్థితి లేదు. రసీదు ఇవ్వమని అధికారులు స్పష్టంగా చెబుతున్నారు. మసీదు ఇవ్వకుంటే దరఖాస్తు చేసి ఏం లాభం అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తుతో పాటు రేషన్, ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరి అని అధికారులు తెలిపారు, రేషన్, ఆధార్ కార్డు లేని వారి పరిస్థితి ఏమిటి అనేది స్పష్టత లేదు. అభయహస్తం పథకం పేరుతో రూపొందించిన దరఖాస్తులో తొలుత మహాలక్ష్మి పథకం ఉంది. ఒక కుటుంబానికి ఒక రేషన్ కార్డుకు ఒకటే దరఖాస్తు అని అధికారులు చెబుతున్నారు. ఒక దరఖాస్తులో మహాలక్ష్మి పథకం కింద ఇంటిలో ఒక మహిళ మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఒక ఇంటిలో అత్తా, కోడలు, తల్లి, కూతురు, అక్క, చెల్లి ఉంటే పరిస్థితి ఏమిటి అనేది అందులో స్పష్టత లేదు. ఒక రేషన్ కార్డులో ఒకరి కంటే ఎక్కువ మహిళలు ఉంటే మహాలక్ష్మి పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలని అందులో లేదు. ఇకపోతే మహాలక్ష్మి పథకం కింద ఇచ్చే 2500 ఆర్థిక సహాయం, 500 కే గ్యాస్ సిలిండర్ అని చెప్పారు. కానీ నగదు బదిలీ చేయడానికి బ్యాంకు అకౌంట్ నెంబరు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ దరఖాస్తుతో అడగలేదు. బ్యాంక్ అకౌంట్ నెంబర్ లేకుండా మహిళలకు 2500 రూపాయలు ఆర్థిక సహాయం ఎలాచేస్తారు..?అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఇకపోతే రెండవది రైతు భరోసా పథకం రైతు భరోసా పథకంలో ఎకరానికి 15,000 రూపాయలు ఇస్తామని రైతు, కౌలు రైతులకు ఇస్తామని తెలిపారు. వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు ఇస్తామని తెలిపారు. ఒక ఇంట్లో కౌలు రైతు. కూలీ రైతు. సాగు రైతు ఉంటే ఎలా దరఖాస్తు చేసుకోవాలో అనేది ఇందులో లేదు. అంతేగాక రైతు భరోసా ఆర్థిక సాయం చేయడానికి బ్యాంక్ అకౌంట్ నెంబరు అడగలేదు. మూడవది ఇందిరమ్మ ఇండ్లు పథకం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు లేని అర్హులైన కుటుంబానికి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తారని తెలిపారు. ఎంత చేస్తారు..? అనేది చెప్పలేదు. బ్యాంక్ అకౌంట్ నెంబరు అడగలేదు. అమరవీరుల కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా కోరలేదు. అమరవీరులకు, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం ఇస్తారని తెలిపారు. ఇక్కడ ఉద్యమకారులు ఉద్యమంలో పాల్గొన్నది ఒక ఊర్లో కాగా వాళ్ళు ఉండేది మరో ఊరిలో ఉంటున్నారు. వారు ఏ ఊరిలో దరఖాస్తు చేసుకోవాలని స్పష్టత లేదు. ఇకపోతే నాలుగోది గృహ జ్యోతి పథకం ఒక కుటుంబానికి రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని తెలిపారు. విద్యుత్ మీటర్ కనెక్షన్ సంఖ్య అడిగారు. అద్దె ఇంట్లో ఉన్న వారి పరిస్థితి ఏమిటి అనేది స్పష్టత లేదు. రాయితీ అద్దె ఉండే ఇంటి వారికి వర్తిస్తుందా..? ఇంటి యజమానికి వర్తిస్తుందా..? అనేది స్పష్టత లేదు. ఇకపోతే ఐదవది చేయూత పథకం. ఈ పథకంలో వృద్ధాప్య, గీత కార్మికులు, డయాలసిస్ బాధితులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, వితంతు, చేనేత, ఎయిడ్స్, ఫైలేరియా, బీడీ టేకేదారులకు 4000 దివ్యాంగులకు 6000 పింఛన్ ఇస్తామని తెలిపారు. ఇందులో ప్రస్తుతం పింఛన్ పొందుతున్న వారు దరఖాస్తు చేయవలసిన అవసరం లేదని స్పష్టంగా తెలిపారు. ప్రధానంగా ఐదు సంక్షేమ పథకాలకు సంబంధించి ఒకే దరఖాస్తు ఫారం పూరించాలని తెలిపారు. ఇందులో ఒక గృహదారునికి సుమారు 5ఎకరాల కోసం రైతు భరోసా పథకం లబ్ధి కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే అతనికి ఇతర పథకాలు వర్తిస్తాయో..? లేదో..? అనేది స్పష్టత లేదు. భూమి ఉన్నవారికి పింఛన్లు, ఇందిరమ్మ ఇల్లు, గ్యాస్ రాయితీ ఎందుకు ఇస్తారు..? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఒక కుటుంబానికి ఇందులో ఒకే ఒక్క పథకం వర్తింపజేసే అవకాశం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రధానంగా రైతు భరోసా పథకంలో గతంలో రైతు బంధు పొందుతున్న వారు దరఖాస్తు చేయాలా..? వద్దా..? అనేది స్పష్టత లేదు. అంతేకాక ఒక గ్రామంలో పొలాలు ఉండి మరో గ్రామంలో నివాసం ఉంటున్న వారు ఏ గ్రామంలో దరఖాస్తు చేయాలనేది స్పష్టత లేదు. రైతు భరోసా కోసం రేషన్ కార్డు దారులు మాత్రమే అర్హులని ప్రకటించారు. వ్యవసాయ భూములు ఉండి రేషన్ కార్డు లేని వారు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు అర్హులు కాదా..? అని ప్రశ్నిస్తున్నారు. ప్రజా పాలన దరఖాస్తుల ప్రక్రియపై అనేక అనుమానాలు ఉండడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. అధికారులు కూడా పూర్తి వివరాలు తెలియకపోవడంతో సతమతం అవుతున్నారు.

## తరుగు లేకుండా కొనుగోలు చేయడం హర్షణీయం

- సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం

**నవతెలంగాణ-బయ్యారం**



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోపే తరుగు లేకుండా వడ్లను కొనుగోలు చేయడం, 2200 రూపాయలు ప్రభుత్వం అందించడం, అలాగే సన్న ధాన్యాన్ని బయట క్వింటాకు 3000 వరకు కొనుగోలు చేయడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రైతులకు అండగా నిలబడి, రైతు సంక్షేమం కోసం పాటుపడి రైతుల బాధలను తొలగించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం ఆయన చిత్రపటానికి బయ్యారం కొనుగోలు కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు తెలబోయిన లింగయ్య అధ్యక్షతన పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ టీపీసీసీ నాయకులు, మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా రైతు పండించిన పంటను తరుగు పేరుతో దోచుకుంటున్న గత ప్రభుత్వాల నియంత పాలన కూల్చి, తరుగు లేకుండా సన్న ధాన్యానికి క్వింటాలుకు 2200 రూపాయలు చెల్లించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నెల రోజులలోపే రేవంత్ రెడ్డి పాలనలో రైతులు సంతోషం వ్యక్తం చేసి వారి చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అదే విధంగా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 6 గ్యారంటీ కార్డులని 100 రోజులలో అమలు చేస్తామని చెప్పిన విధంగా చేస్తున్న సందర్భంగా నీళ్లు, నిధులు, నియామకాల పేరిట రాష్ట్రం సిద్ధిస్తే 10 సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి కేంద్ర ప్రభుత్వంతో సంధి కుదుర్చుకొని రాష్ట్రాన్ని అంధకారం చేసిన కేసీఆర్‌కు చెంప పెట్టుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ప్రధాని మోడీని కలిసి ఉమ్మడి విభజన చట్టంలో పొందుపరచిన బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరడం హర్షిస్తూ, ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనసరి కోటమ్మ, ఎంపీటీసీ సోమేశ్, మండల ప్రధాన కార్యదర్శి గట్ల గణేష్, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు రాము నాయక్, తగిర సత్తిరెడ్డి, మహిళా మండలాధ్యక్షురాలు తగిర నిర్మలా రెడ్డి, బత్తిని రామూర్తి, సొసైటీ డైరెక్టర్లు, కేతమల్లు, బండారు మల్లయ్య, పగడాల శ్రీనివాస్, భూక్యా రవి నాయక్, పొట్ల విద్యాసాగర్, రైతులు గుండ్ల ఏశోదమ్మా, కోళ్ల పూర్ణ చందర్, వెంకన్న, గజ్జి లింగయ్య, మందా లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎంపిక

- అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బాస నాగమణి

**నవతెలంగాణ-మహబూబాబాద్**

జాతీయ అంతర్ జిల్లాల స్థాయి క్రీడాకారుల ఎంపికను బుధవారం మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించినట్లు అథ్లెటిక్ అక్యులేషన్ జిల్లా కార్యదర్శి బాస నాగమణి తెలిపారు. అండర్-14, 16 విభాగంలో బాలబాలికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ క్రీడల్లో జిల్లా నలుమూలల నుండి 300 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఈపోటీల్లో ఎంపికైనవారు ఫిబ్రవరి 2024 లో గుజరాత్‌లో జరిగే 19వ జాతీయ అంతర్ జిల్లాల పోటీలో పాల్గొంటారని నాగమణి తెలిపారు. ఈ పోటీలకు పరిశీలకులుగా తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి గంగిశెట్టి మనోజ్ కుమార్ హాజరయ్యారు. ఈ పోటీలలో ఎంపికైన వారికి స్పోర్ట్స్ కిట్ ఇస్తామని మహబూబాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి బి.అనిల్ కుమార్, వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు సింధు వర్మ, వీరన్న, దక్షి నాయక్, స్వప్న, జ్యోతి, వెన్నెల, నిర్మల, కృష్ణ, అశోక్ ధనాజీ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

### మిర్చి రైతులను నిండా ముంచిన...

**పెట్టిన పెట్టుబడి రాదని లబోదిబో మంటున్న రైతులు**

# గుబ్బ, నల్లి వైరస్..!

**నవతెలంగాణ-మరిపెడ**

మిర్చి పంటపై కోటి ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగిలింది. గత సంవత్సరం పలికిన మిర్చి ధరను చూసి రైతులు ఈ రబీ సీజన్‌లో భారీ స్థాయిలో మిర్చి పంటను సాగు చేశారు. గుబ్బ, నల్లి వైరస్ తీవ్రంగా నష్టపోయిన రైతులను,తోటలను పరిశీలించి రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపాల్సిన అధికారులు చేతులు ఎత్తేయడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. మరిపెడ మండలంలోని 44 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 8600 ఎకరాలలో సుమారు 7వేల మంది రైతులు మిర్చి పంటను సాగు చేసినట్లు సమాచారం. ఎల్లంపేట, వీరారం. ఉల్లేపల్లి, అబ్బాయి పాలెం, తానంచర్ల, తాళ్లపుకల్, రాంపూర్ సెక్టార్ ప్రాంతాలలో రైతులు మిర్చి తోటలను భారీగా పెట్టినట్లు రైతులు తెలిపారు. మొక్క నాటి మూడు నెలలు అవుతున్న మొక్క ఆశించిన స్థాయిలో పెరగకపోగా, తోట ఎన్నిమందులు కొట్టిన ఎదుగు,పొదుగులేకుండా మిర్చితోటలకు గుబ్బ, నల్లి లాంటి రసం పిలిచే వైరస్ రావడం రైతులను ఉక్కిరిబిరి జేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోటి ఆశలతో రైతులు ఎకరానికి లక్ష రూపాయల చొప్పున ఖర్చు చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు పెరిగిపోయి రైతులు ఆందోళన బాట పడుతున్న పరిస్థితి నెలకొందని పలువురు రైతులు పేర్కొన్నారు. ఉమ్మడి ఊల్లేపల్లి పరిధిలో సుమారు 500 ఎకరాలలో రైతులు మిర్చి తోటలు పెట్టగా నల్లి, గుబ్బ రోగం వచ్చి మిర్చి తోటలను చెడగొడుతున్నారని తెలిపారు. పెట్టిన పెట్టుబడులు కూడా రావటం లేదని లునావత్ తండాకు చెందిన ఆ గ్రామ సర్పంచ్ వీరమల్లు తెలిపారు. 8 ఎకరాలు మిర్చి తోట నాటగా, ఎకరానికి లక్ష రూపాయల చొప్పున 8 లక్షల రూపాయలు తోట కోసం ఖర్చు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులకు ఇంత నష్టం జరుగుతున్న అధికారులు ఎవరు స్పందించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



**రసం పీల్చే పురుగులను నివారించాలి : అధికారి వీరా సింగ్**

మిర్చి తోటలు సాగు చేసిన రైతులు నల్లి, గుబ్బ రోగంతో బాధపడుతున్న రైతులు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. మిర్చి తోటలో తెల్ల దోమ, రసం పీల్చే పురుగులను నివారించినట్లయితే వైరస్‌ను నివారించవచ్చు అని ఆయన పేర్కొన్నారు. పంట మార్పిడి చేయటం వల్ల రైతుకు ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఏది చేసినా వ్యవసాయ శాఖ అధికారులు సూచనలతో చేయాలని ఆయన సూచించారు.

**మిర్చి రైతులను ఆదుకోవాలి, రైతులు**

మిర్చి సాగులో గుబ్బ, నల్లి వైరస్‌తో తీవ్రంగా నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతులు లునావతు బాబురావు, లూనావతి బిక్షం, ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అధికారులు పర్యటించి రైతుకు జరిగిన నష్టపరిహారాన్ని అంచనా వేయాలని వారు కోరారు.

# నీటి ఎద్దడి తీర్చేందుకే బోరు బావి

**నవతెలంగాణ-గణపురం**

ప్రజలకు నీటి ఎద్దడి తీర్చేందుకు అడ్వాన్సుగా బోరుబావిని వేసినట్లు వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్ అన్నారు బుధవారం బుద్దారం గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవాలయంలో డి ఎం ఎఫ్ టి నిధులతో మంజూరైన బోరును శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు వేయించినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లవేన రవి సీనియర్ లీడర్ అంబటి పెల్లి సంపత్ రావు ముదిరాజ్ జిల్లా నాయకులు మాలభద్రయ్య ముదిరాజ్ సంఘం మరియు సీనియర్ నాయకులు మల్లవైన ఉప్పలయ్య మల్లవేన వేణు మల్లవేన సారంగం మాల రవి బుద్ధారం గ్రామం ముదిరాజ్ పాల్గొన్నారు.



# భూపాలపల్లి ఏరియాలో ఐఎన్టీయూసీ గెలుపు

- 801 ఓట్ల మెజార్టీతో ఏఐటీయూసీపై గెలుపు
- ప్రశాంతంగా ముగిసిన సింగరేణి గుర్తింపు ఎన్నికలు
- సింగరేణి వ్యాప్తంగా 95 శాతం పోలింగ్
- భూపాలపల్లిలో 94.7శాతం పోలింగ్

**నవతెలంగాణ -కోల్ బెల్ట్**

బుధవారం జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో కార్మిక సంఘాలు హెూరాహెూరీగా పోటీపడగా భూపాలపల్లి ఏరియాలో గత ప్రాతినిధ్య సంఘం ఏఐటీయూసీఐపై కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్టీయూసీ(సింగరేణి కోల్‌మైన్ లేబర్ యూనియన్) 801 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. 1946 ఓట్లు ఏఐటీయూసీకి పోలు కాగా 2747 ఓట్లు ఐఎన్టీయూసికి పోలయ్యాయి. కాగా భూపాలపల్లి జిల్లా ఏరియాలో మొత్తానికి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలలో 13 ప్రధాన కార్మిక సంఘాలు బరిలో నిలువగా... మొత్తం 39,800 కార్మికులు వుండగా 37,451 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సింగరేణి వ్యాప్తంగా 95 శాతం పోలింగ్ నమోదయ్యింది . భూపాలపల్లి ఏరియాలో 5,410 మంది కార్మికులు ఉండగా 5,123 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 94.7 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఏరియాలోని కేటికే -1,5 గనుల వద్ద



ఏఐటియూసి నాయకులు , కార్యకర్తలు ఎర్ర చొక్కాలు ధరించి పోలింగ్ బూత్‌లు వద్ద ఓట్లు అభ్యర్థిస్తుండగా బీఎంఎస్, ఐఎన్టియుసి నాయకులు అభ్యంతరం తెలపగా స్వల్ప ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సందర్భంలో పోలీసులు కలుగజేసుకొని వారించారు.



## గర్భిణిలకు మెరుగైన సేవలు అందించాలి

- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్

**నవతెలంగాణ - ములుగు**

గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలని, నైపుణ్యమైన సేవలు నిరంతరం అందించాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆదేశాల మేరకు జిల్లా ఆస్పత్రి సూపరిండెంట్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏటూరునాగారం సూపరింటెండెంట్‌లు క్లిష్టతరమైన కాన్పులపై సమీక్షా, మాతా శిశు సంరక్షణ పోర్టల్ పై అప్డేట్స్ పై జిల్లా ఆరోగ్య సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ.. మెరుగైన సేవలతో మాత.శిశు మరణాలు తగ్గించవచ్చునని అన్నారు. గర్భిణీలను త్వరితగతంగా రిజిస్ట్రేషన్ ప్రారంభించాలని, వారికి అవసరమైన సేవలు అందించాలని, వాటన్నింటినీ ఎంసిహెచ్ పోర్టల్‌లో పొందుపరచాలని తెలిపారు. క్లిష్టతరమైన కాన్పులపై గర్భిణీలకు అందించే సేవలపై ప్రత్యేక దృష్టి ఉంచాలని కోరారు. ఇంతకుముందు కాన్పు కొరకు ఆపరేషన్ చేయించుకున్న పేషంట్ల పట్ల, బాలింత రోగం ఎక్లామ్సియా ఉన్నవారి పట్ల, కాన్పులో రక్తస్రావం, షుగర్ వ్యాధి కలవారికి, కవలలకు జన్మనిచ్చిన వారికి, రక్తహీనత ఉన్నవారికి, రెండు కాన్పుల కంటే ఎక్కువ కాన్పులు అయినవారికి నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు. ప్రసవం తర్వాత నెల రోజుల వరకు తల్లి బిడ్డ క్షేమం కొరకు ఇచ్చు సేవల గురించి అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ విపిన్ మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందించాలని అన్నారు. ముర్రుపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందని అన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ మాతా శిశు సంరక్షణ డాక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ కెసిఆర్ కిట్ పోర్టల్ ప్రస్తుతం అది ఎంసిహెచ్ పోర్టల్‌గా మారిందని,ప్రసవం తర్వాత అందించే సేవలు వాటికి సంబంధించిన వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏటూర్‌నాగారం సూపరంటెండెంట్ డాక్టర్ సురేష్ కుమార్, వైద్యాధికారి డాక్టర్ గౌతమ్ , జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతయ్య, మాత శిశు సంరక్షణ మానిటరింగ్ సూపర్వైజర్ భాస్కర్, డాటా ఎంట్రీ ఆపరేటర్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**నవతెలంగాణ-మహాదేవపూర్**

మధ్యాహ్న భోజనం కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ మండల అధ్యక్షురాలు కే శారద ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో మండల విద్యాధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న బోజన కార్మికులు అప్పులు చేసి పిల్లలకు భోజనం వడ్డిస్తున్నా, ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిరసన తెలిపిన ప్రతీసారి అప్పుడు ఇప్పుడు అంటూ అధికారులు దాటవేసే సమాధానం చెబుతున్నారే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లును పెంచాలని కోరారు. నిత్యవసరాలు సరుకుల ధరలతోపాటు కోడిగుడ్డు ధరలు కూడా విపరీతంగా పెరిగాయని దీంతో విద్యార్థులకు భోజనం అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అనానరు. దీనిని దృష్టిలో పెట్టుకొని పెరిగిన ధరల అనుకూలంగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుజాత, మల్లమ్మ, బుజ్జమ్మ, వెంకటమ్మ పావని పోసక్క, పద్మతోపాటు పలువురు పాల్గొన్నారు.





# ప్రజాగొంతుక 'నవతెలంగాణ'

- ఎంపీపీ మలహాల్‌రావు
- నవతెలంగాణ క్యాలెండర్-2024 ఆవిష్కరణ

**నవతెలంగాణ-మల్హర్‌రావు**

ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధికారుల దష్టికి తీసుకపోతూ ,నవ తెలంగాణ దినపత్రిక, ప్రజా గొంతుకగా నిలుస్తోందని మండల ఎంపిపి చింతలపల్లి మలహల్ రావు అన్నారు.బుధవారం మండల కేంద్రమైన తాడిచెర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో నవ తెలంగాణ 2024 నూతవ సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు.ఈ సందర్బంగా మండల ప్రజలందరికీ అడ్వాన్స్ గా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడిచెర్ల ఎంపిటిసి-2 సభ్యురాలు రావుల కల్పన మొగిలి,తాడిచెర్ల పిఏసిఎస్ సింగిల్ విండో డైరెక్టర్ ఇప్ప మొ%శీ%డయ్య,ఉపాదిహామీ పథకం ఎపిఓ హరీష్,మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ ఆదిత్య చక్రవర్తి, ఆపరేటర్ మహేష్, తాడిచెర్ల పంచాయతీ కార్యదర్శి శేఖర్,కాంగ్రెస్ నాయకుడు బూడిద రాజా సమ్మయ్య, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజాపాలన గ్రామసభలను కట్టుదిట్టంగా నిర్వహించాలి



- అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి శ్రీజ

**నవతెలంగాణ - ములుగు**

జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కట్టుదిట్టంగా ప్రజాపాలన సభలు నిర్వహించి ప్రజల నుంచి మహాలక్ష్మీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తులు పకడ్బందీగా స్వీకరించాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి. శ్రీజ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణు గోపాల్, ఆర్‌డీఓ కే సత్య పాల్ రెడ్డితో కలిసి ప్రజా పాలన గ్రామసభల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పి శ్రీజ మాట్లాడుతూ.. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు పని దినాలలో జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, గ్రామ సభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ప్రతి మండలం పరిధిలో మండల ప్రత్యేక అధికారి, తహసిల్దార్, ఎంపీడీవో, ఎంపీఓ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతిరోజు ప్రతి బృందం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు షెడ్యూల్లో గ్రామసభ నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజాపాలన సభలలో పాల్గొనే సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. గ్రామ ప్రజలకు ముందు గానే దరఖాస్తులు అందించాలని, వాటిని ముందుగానే పూరించి గ్రామ సభకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామంలోని నిరక్షరాస్యులకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు దరఖాస్తు నింపడంలో సహకరించేలా చూడాలన్నారు. గ్రామసభ నిర్వహణపై డప్పు చాటింపు ద్వారా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజా పాలన సభ నిర్వహణకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆధార్, రేషన్ కార్డు జత చేసేలా చూడాలని అన్నారు. గ్రామసభలలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద క్యూలైన్ విధానం పాటించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేర పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన దరఖాస్తు ఫారంలు మండలాలకు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రతిరోజు ప్రజాపాలన సభలలో తీసుకునే దరఖాస్తులను ఎప్పటికప్పుడు కంప్యూటర్లో నమోదు చేయాలని, దరఖాస్తుదారునికి రసీదు అందించాలని అన్నారు. డీపీఓ వెంకయ్య, మండల ప్రత్యేక అధికారులు, తహశీదార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి : అదనపు కలెక్టర్

ప్రజాపాలన ద్వారా అర్హత గల ప్రతి ఒక్కరికి క్షేత్రస్థాయిలో పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమాభివద్ధి ఫలాలు అందజేసే విధంగాచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) డి వేణు గోపాల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డి వేణు గోపాల్, ఆర్డిఓ కే సత్యపాల్ రెడ్డి, ఎంపీపీలు, జడ్పిటిసిలతో కలసి అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారతలను చేకూర్చడం కొరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో కార్యక్రమం ఉంటుందని, సంబంధిత దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎంపీపీలు శ్రీదేవి, శ్రీనివాస్ రెడ్డి, రజిత, జడ్పిటిసి కరంచంద్ గాంధీ, మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.





### దరఖాస్తుల స్వీకరణ : జడ్పీసీఈఓ ప్రసూన రాణి

**ఏటూరునాగారం ఐటీడీఏ :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం ప్రభుత్వం ఈనెల 28వ తేదీ నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ ఆధ్వర్యంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులు వారి ఆదార్, రేషన్ కార్డు, ఫోటో ఇతర సమాచారంతో కూడి అభయహస్తం దరఖాస్తును పూర్తి చేసి కౌంటర్లలో అందజేయాలన్నారు.



### సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్ శ్రీపతిబాపు

**మహాదేవపూర్ :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం గ్యారెంటీ పథకాల్లో లబ్ది పొందేందుకు ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ శ్రీపతిబాపు తెలిపారు. డిసెంబర్ 28 నుండి జనవరి 6 వరకు ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. గ్రామ ప్రజలు ప్రజా పాలన గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేయడానికి గ్రామ సభలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. రేషన్ కార్డు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చుని వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ చల్ల తిరుపతిరెడ్డి అన్నారు. వృద్ధులు, వికలాంగులు,మహిళలకు ప్రత్యేక క్యూ లైన్లు,కనీస సౌకర్యాలు కల్పించాలని, వార్డుల వారీగా రద్దీ పెరుగకుండా దరఖాస్తులు తీసుకోవాలని జెడ్పీటీసీ గుడాల అరుణ అన్నారు. ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్,గ్రామ కార్యదర్శి సమ్మయ్య,వార్డు సభ్యులు ఎండీ ఉస్మాన్ ఖాన్,భీముని వెంకటస్వామి,నూకల గట్టమ్మ, మేసినేని రవి చందర్,రెబ్బ అనిత,పంచాయతీ కో ఆప్షన్ సభ్యులు నర్సేన కృష్ణమూర్తి,స్వరాజ్య లక్ష్మి, అంగన్వాడీలు సుజాత, సత్యవాణి, నాగలత, శోభారాణి,సునీత, ఏఎన్ఎం హేమలత పాల్గొన్నారు.



## ప్రజాపాలనను విజయవంతం చేయాలి

- డీఆర్‌డీఓ మండల స్పెషల్ ఆఫీసర్ పురుషోత్తం

**నవతెలంగాణ-గణపురం**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన ప్రజా పాలన కార్యక్రమాన్ని అధికారులు విజయవంతంగా పూర్తి చేయాలని డీఆర్‌డీఓ, మండల స్పెషల్ ఆఫీసర్ పురుషోత్తం అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అరుంధతి ఆధ్వర్యంలో ప్రజా పాలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎంపీడీవోతోపాటు తహసిల్దార్ సతీష్ కుమార్, ఎస్సై మచ్చ సాంబమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. నేటి నుండి గ్రామాలలో ప్రజా పాలనలలో 6 గ్యారంటీ ల స్కీములపై దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్పెషల్ ఆఫీసర్ల సమక్షంలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తు ఫాములు స్వీకరించాలని కోరారు. గ్రామాలలో ఏర్పాటుచేసిన స్పెషల్ ఆఫీసర్లు కిందిస్థాయి సిబ్బందితో పనులు చేయించుకొని సమయం పాలన పాటించాలన్నారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- మండల స్పెషల్ అధికారి అవినాష్

**నవతెలంగాణ-మల్హర్‌రావు**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు చేపట్టే ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్పెషల్ అధికారి అవినాష్ మండలంలోని అన్ని గ్రామాల స్పెషల్ అధికారులను, పంచాయతీ కార్యదర్శులను కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యా లయంలో ఎంపీడీఓ గుండు నరసింహమూర్తి అధ్యక్షతన గ్రామసభల శిక్షణ తరగతులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు 9 రోజులు నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమాలను ప్రత్యక్షంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రజాప్ర తినిధులు, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజాసేకరణ నిశితంగా రికార్డుల్లో పొందపర్చాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెడు తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన పేదలు దరఖాస్తులు చేసుకొని లబ్ధిపొందాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిఓ విక్రమ్ ఆయా గ్రామాల స్పెషల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేటి నుండి ప్రజా పాలన : తహసీల్దార్ అల్లం రాజకుమార్

**నవతెలంగాణ-గోవిందరావుపేట**



నూతన ప్రభుత్వ ఆదేశానుసారం మండలంలోని అన్ని గ్రామ పంచా యతీలలో నేటి నుండి ప్రజా పాలన కార్యక్రమం కొనసాగుతుందని తహసిల్దార్ అల్లం రాజకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజా పాలన సన్నాహక సమావేశం నిర్వహించారు. తాహసిల్దార్ అల్లం రాజకుమార్ ప్రజాపాలన దరఖాస్తు నమూనాను ప్రజాప్రతినిధులు అధి కారులతో కలిసి విడుదల చేశారు. అనంతరం తహసిల్దార్ రాజకుమార్ మాట్లాడుతూ ప్రజా పాలన నమూనా వివరించి రేపటినుండి జరుగు గ్రామ సభలలో దరఖాస్తు ఫారములు ప్రజల ద్వారా స్వీకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ, సూడి శ్రీనివాసరెడ్డి ఎంపీటీసీలు, కోఆప్షన్ నెంబర్, సర్పంచులు, మరియు అధికారులు మండల పంచాయతీ అధికారి, తహసిల్దార్, టీం లీడర్లు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఎంపీపీ సూడి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ సదవకాశాన్ని ప్రజలు వినియో గించుటకు ప్రజా ప్రతినిధులు అధికారులు అందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు.

## జీపీ ప్రత్యేక అధికారులు కార్యదర్శులకు అవగాహన

**నవతెలంగాణ-మహదేవపూర్**



మహాదేవపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రాణి బాయ్ రామారావు అధ్యక్షతన ప్రజా పాలనపై గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులకు, సమస్త గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీఓ సుధీర్ కుమార్, ప్రత్యేక అధికారి, జడ్పిటిసి గుడాల అరుణ, ఎంపీడీవో రవీంద్రనాథ్, తాసిల్దార్ లక్ష్మీ రాజయ్యఎంపీఓ ప్రసాద్‌తో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. మహాదేవపూర్ మండలంలో నేడు కుదురుపల్లి, మద్దులపల్లి, మెట్ పల్లి, రాపల్లి కోట, పెద్దంపేట, గ్రామపంచాయతీలలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల అమలుకు ప్రజా పాలన కార్యక్రమం క్రింద లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. దరఖాస్తు ఫారంలను ఉచితంగా గ్రామపంచాయతీల ద్వారా ముందస్తుగా గ్రామంలో పంపిణీ చేస్తారన్నారు. ప్రజా పాలన కార్యక్రమం ఏర్పాటు చేసిన ప్రదేశంలో దరఖాస్తుతో పాటు తెల్ల రేషన్ కార్డు జిరాక్స్ ప్రతి, కుటుంబ యజమాని యొక్క ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతి, పాస్ పోర్ట్ సైజు ఫోటో, ఇతరత్రా పత్రములను జతపరిచి గ్రామపంచాయతీలో కేటాయించిన కౌంటర్లో దరఖాస్తు అందజేసి కౌంటర్ ఇన్‌చార్జి అధికారిచే రసీదు తీసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు రేషన్ కార్డులో నూతనముగా పేర్లు నమోదు, నూతన రేషన్ కార్డునకు దరఖాస్తు, రేషన్ కార్డులో పేర్లు మార్పులు చేర్పులకు సంబంధించి కూడా దరఖాస్తులను అందజేయొచ్చని తెలిపారు. ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. గ్రామపంచాయతీలో ఏమైనా సమస్యలు తలెత్తితే ప్రజా పాలన గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారికి తెలపాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, టెంట్లు, వికలాంగులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహదేవపూర్ ఎస్సై రాజకుమార్, కాళేశ్వరం ఎస్సై లక్ష్మణరావు, పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజినీర్ సాయిలు, మహాదేవపూర్ ఎంపీటీసీ సుధాకర్, తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## బాంబులు గుర్తించి ధ్వంసం చేసన పోలీసులు

**నవతెలంగాణ-మహాదేవపూర్**

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర పరిధి సుకుమ పోలీసులను లక్ష్యంగా చేసుకొని అమర్చిన రెండు బాంబులను పోలీసులు గుర్తించారు. భద్రత బలగాలు గోరుకొండ నుండి బంజారపర వెళ్లే రహదారికి సమీపంలో రెండు ఐఈడీ, ఒక్కటి 10 కేజీలున్న బాంబులను స్వాధీనం చేసుకుని భద్రతా బలగాలు అక్కడే సురక్షితంగా ధ్వంసం చేశారు. కాగా పోలంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేశారు.

# ఇదేం చలి...బాబోయ్...





- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- కమ్ముకున్న పొగమంచు

**నవతెలంగాణ-మల్హర్‌రావు**

మండలంలో వారం రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి.ఒక దశలో 10 డిగ్రీలకు పడిపోవడంతో ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు విడటం లేదు. మంగళవారం మండలంలోని మల్లారం నుంచి కొయ్యుర్ నాగులమ్మ వరకు పొగమంచు కప్పెయ్యడంతో రహదారి స్పష్టంగా కనిపించ లేదు. ఫలితంగా వాహనదారులు లైట్లు వేసుకొని ముందుకు సాగాల్సిన పరిస్థితి నెలకొంది.ప్రధానంగా చల్లని గాలులతో చలి తీవ్రంగా పెరుగుతుంది.గత నాలుగు రోజుల నుంచి ఉదయం, సాయంత్రం ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతున్నాయి. దీంతో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా చలి గజగజ వణికిస్తోంది. ఒక్కసారిగా మారిన వాతావరణంతో ప్రజలు చిన్నా, పెద్ద తేడా లేకుండా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చలి మంటలతో ఉపశమనం పొందుతున్నారు.ఉదయం పూట పొగమంచు కమ్మేస్తుండటం, 9 గంటలైన చలి తగ్గకపోవడంతో వద్దులు, చిన్నపిల్లలు విలవిలాడుతున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటున్న సాయంత్రం తరువాత చలి తీవ్రత పెరుగుతుంది. అన్ని రకాల సౌకర్యాలు, అన్ని దుస్తులు అందుబాటులో ఉంచుకొని ప్రజలు జగ్రత్తగా ఉండాలని ప్రజలు సూచిస్తున్నారు.

### పొంచివున్న వ్యాధులు...

చలి తీవ్రతకు మనిషి శరీరంలోని రక్త నాలాలు ముడుచుకుపోతాయి. దీంతో రక్త ప్రసరణ సాఫీగా సాగదు.అది గుండె, మెదడుపై ప్రభావం చూపి ఆయాసం,గుండె నొప్పి,బ్రెయిన్ స్ట్రోక్,పిట్స్,ఆకస్మికంగా కుప్పకూలడం వంటివి తలెత్తే ప్రమాదం పొంచివుంది.అధిక చలి వల్ల ఆస్తమా,శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.



## విజేతలకు బహుమతుల ప్రదానం

**నవతెలంగాణ -కోల్‌బెల్ట్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆజంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో భగవద్గీత లోని మూడవ అధ్యాయంలోని మొదటి 30 శ్లోకాలను కంటస్తీకరణ చేసిన వారికి పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో అదే పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థినులు రోహిణికి మొదటి బహుమతి, కీర్తనకి ద్వితీయ బహుమతి, శ్రీహర్షినికి తృతీయ బహుమతి గెలుచుకోగా, సీనియర్ విభాగంలో వేద పాఠశాల విద్యార్థులు చిరంజీవి కి మొదటి బహుమతి, అస్మిత్‌కి రెండో బహుమతి, రవితేజకి మూడో బహుమతి గెలుపొందగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సద్గురు రాధాకష్ణ గీతామాధురి వ్యవస్థాపకులు తెలపండి రాఘవేంద్ర రాజు, ఆజంనగర్ వేద పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంగల నరహరి శర్మ , భూపాలపల్లి జిల్లా ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు గూడూరు నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## పేదలకు న్యాయం జరిగేలా చూడాలి

- జయశంకర్ జిల్లా ఉపాధ్యక్షులు, ఎంపీటీసీ మంచినీళ్ళ దుర్గయ్య

**నవతెలంగాణ-మహదేవపూర్**



ప్రతి పేద గడపకు కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీ పథకాలు చేరేలా, వారికి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో కృషి చేయాలని జయశంకర్ జిల్లా ఉపాధ్యక్షులు, అన్నారం ఎంపీటీసీ మంచినీళ్ళ దుర్గయ్య ప్రకటనలో కోరారు. మహాదేవపూర్ మండలంలోని అన్నారం ఎంపీటీసీ పరిధిలో అభయహస్తం గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ, ప్రజా పాలన గ్రామసభ నిర్వాహణ ఉంటుందని అన్నారు. ఆ సమయంలో మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు మొదలగు పథకాలకు సంబంధించి నేడు దరఖాస్తులు స్వీకరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై కఠినమైన చర్యలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అన్నారం, చంద్రుపల్లి నాగేపల్లి, మద్దులపల్లి, పలుగుల కుంట్లమ్‌లో ప్రతి కాంగ్రెస్ లీడర్ భాగస్వామ్యమై ప్రతి పేదవారికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

## నేటి నుంచి ప్రజా పాలన కార్యక్రమం

**నవతెలంగాణ-మహదేవపూర్**

మహాదేవపూర్ మండలంలో నేటి నుండి నుండి 6.01.2024 వరకు ప్రజాపాలన కార్యక్రమం ఉంటుందని తాసిల్దార్ లక్ష్మీరాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీ పథకాలకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. ఇందుకు గ్రామపంచాయతీల వారీగా షెడ్యూల్ తయారు చేయడం జరిగిందన్నారు. దీనికి అనుగునంగా ఆయా గ్రామాలలో షెడ్యూల్‌కు ముందురోజు డప్పు చాటింపు ద్వారా గ్రామప్రజలకు తెలియజేస్తామన్నారు. అప్లికేషన్ ఫారంలు ప్రభుత్వమే నేరుగా ప్రజలకు సమకూర్చుతుందన్నారు. మధ్యవర్తుల ద్వారా గానీ, మీసేవ సెంటర్లు, జిరాక్స్ సెంటర్ల ద్వారా పొందిన అప్లికేషన్స్ స్వీకరించరని అన్నారు.

## వివరాలు అందుబాటులో ఉంచుకోవాలి

- జెడ్పీటీసీ గుడాల అరుణ

**నవతెలంగాణ-మహదేవపూర్**

ప్రజా పాలన దరఖాస్తు అప్లికేషన్‌లు సమర్పించేటప్పుడు అందుబాటులో అన్ని వివరాలు ఉంచుకోవాల జడ్పిటిసి గుడాల అరుణ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు నెంబర్లు, రేషన్ కార్డు నెంబర్, మహాలక్ష్మి పథకం గ్యాస్ కనెక్షన్ నెంబర్, కంపెనీ పేరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం నంబర్లు, సర్వే నెంబర్లు, భూమి విస్తీర్ణం వివరాలు సమరించాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ కార్డు నెంబర్ ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకంకు అమరవీరులు ఉంటే అమరులైన సంవత్సరం, ఎఫ్ఐఆర్ నెంబర్, డెత్ సర్టిఫికెట్ నెంబర్. గృహజ్యోతి పథకం కరెంట్ మీటర్ కనెక్షన్ నెంబర్, చేయూత పథకంకు దివ్యాంగులు - సదరం సర్టిఫికెట్ నెంబర్ ఉండాలని అన్నారు. అప్లికేషన్ ఫారంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్ సమర్పించాల్సి ఉంటుందని సూచించారు.

## పోలింగ్ బూత్ వద్ద సీఐటీయూ ప్రచారం

**నవతెలంగాణ -కోల్ బెల్ట్**

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటు వేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా సిఐటియు అధ్యక్షులు సింగరేణి కార్మికులను అభ్యర్థించారు. బుధవారం జరిగిన సింగరేణి ఎన్నికలలో కేటీకే-5 గని పోలింగ్ బూత్ ల వద్ద సిఐటియు బందంతో కలిసి ఆయన ఆయన ఉదయించే సూర్యుని గుర్తు చూపిస్తూ సిఐటియు కార్మిక సంఘానికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఏరియాలోని 9 పోలింగ్ బూతులలో బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య ఆధ్వర్యంలో సిఐటియు నాయకులు పోలింగ్ సరళిని పరిశీలిస్తూ ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటు వేసి సంఘాన్ని గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

## జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంత్రుల పర్యటన

**నవతెలంగాణ-మహాదేవపూర్**



ఈ నెల29న జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పర్యటించనున్నారు. 10:30 గంటలకు హైదరాబాదు నుండి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 11:30కి మేడిగడ్డకు చేరుకుంటారు. 11:30నుండి 1:00గంట వరకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నష్టంపై సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1:00నుండి 2:00గంటల వరకు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి క్యాంపు కార్యాలయానికి తిరిగి వెళ్తారు. 02:00గంటల నుండి 03:00గంటల వరకు మీడియా ప్రతినిధులతో కలిసి భోజనం చేస్తారు. 03:00నుండి 03:20వరకు మేడి గడ్డ నుండి అన్నారం బ్యారేజ్ చేరుకుంటారు. 3:20నుండి 4:20 వరకు అన్నారం బ్యారేజ్ పరిశీలిస్తారు. 4:30 గంటలకు అన్నారం బ్యారేజ్ నుండి బయల్దేరి 5:30కి తిరిగి బేగంపేట విమానాశ్రయం చేరుకుంటారని డీపీఆర్ఓ శ్రీధర్ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఈనెల 38 జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పివిపి లలితా శివజ్యోతి

**నవతెలంగాణ- ములుగు**



జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాలను అనుసరించి ఈనెల 30న జాతీయ లోక్ అదాలత్‌ను ములుగు జిల్లా కోర్టులో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ పివిపి లలిత శివ జ్యోతి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి మాధవి ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు వీలును బట్టి కేసులను రాజీ కుదుర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజీపడదగు క్రిమినల్, సివిల్ కేసులు, భూ తగాదాల కేసులు, మోటార్ వెహికిల్ యాక్సిడెంట్ కేసులు, వివాహ, కుటుంబ తగాదా కేసులు, బ్యాంకు, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్, డిజాస్టర్ మేనేజ్మెంట్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు,ఇన్సూరెన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, విద్యుత్ చోరీ, కన్స్యూమర్ ఫోరమ్ కేసులు, ట్రాఫిక్ ఈ-ఛాలన్ కేసులు, ప్రీ- లిటిగేషన్ కేసులు ఇతరవి ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కక్షిదారులు హాజరై కేసులను పరిష్కరించుకునేలా సిద్దం కావాలని కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేసేందుకు ఇప్పటికే పోలీసు అధికా రులతో, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో, ఎక్సైజ్ శాఖ అధికారులతో అధిక కేసుల పరిష్కార దిశగా చర్యలు చేపట్టామని చెప్పారు. ఇప్పటివరకు ములుగు జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ లో గుర్తించబడిన కేసులలో మొత్తం 478 పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వీటిలో ఇప్పటి వరకు -478 కేసుల లోని కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. కేసులను పరిష్కరించేందుకు 4బెంచీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. లోక్ అదాలత్ పట్ల సందేహాల నివృత్తికి న్యాయసేవాధికార సంస్థ ను ఆశ్రయించొచ్చని సూచించారు.

## లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి : ఎస్సై

**నవతెలంగాణ-మంగపేట**

మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులలో జరిమానా కట్టని వారు ఈ నెల 30 వ తేదీ వరకు జరుగు లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని ఎస్సై గోదరి రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో విలేకరులతో మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పదివేల రూపాయల జరిమానాను చెల్లించవలసి ఉన్న ప్రతి ఒక్కరు ఈ నెల 30వ తేదీ లోపు ములుగు అదనపు జేఎఫ్ సిఎం కోర్టులో హాజరై నేరాన్ని అంగీకరిస్తే అట్టి పదివేల రూపాయల జరిమానాను కేవలం 2000 రూపాయలకు తగ్గించుకోవడంతో పాటు కేసులను తొలగించుకోవచ్చని ఆయన తెలిపారు. అంతేగాక మండలానికి చెందిన పి శివకుమార్, ఏ దినేష్ లు బుధవారం కోర్టులో హాజరు కాగా వారిపై కేసును తలగించి జరిమాన తగ్గించినట్లు రవికుమార్ తెలిపారు.

## ప్రజాపాలన కార్యక్రమానికి గ్రామాల స్పెషల్ అధికారులు వీరే..

**నవతెలంగాణ-మల్హర్‌రావు**

తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ క్రమంలో మండలంలోని 15 గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లుగా మండల స్పెషల్ అధికారి అవినాష్ బుధవారం తెలిపారు. తాడిచెర్ల గ్రామానికి శివకష్ణ (ఏఎస్ఓ), మల్లారం. గ్రామానికి సరితా (ఆర్ఐ రెవెన్యూ). పెద్దతూండ్ల గ్రామానికి ఆర్ శేఖర్(టిఏ ఈజిఎస్), అడ్వాలపల్లి గ్రామానికి సరస్వతి (సూపర్‌వైజర్ ఐసిడిఎస్), ఆన్‌సాన్‌పల్లి గ్రామానికి మంగిలాల్ (ఈసి ఈజిఎస్), చిన్నతూండ్ల గ్రామానికి దుర్గాప్రసాద్(ఏఈఓ వ్యవసాయ శాఖ), దుబ్బపేట గ్రామానికి హరీష్ (ఏపీఓ ఈజిఎస్), ఎడ్లపల్లి గ్రామానికి పి అశోక్(ఏఈ పిఆర్), ఇప్పలపల్లి గ్రామానికి కమల(ఎపిఎం ఐకెపి), కొండంపేట గ్రామానికి (కె వెంకటయ్య సిసి ఐకెపి), కొయ్యుర్ గ్రామానికి జె.ఆదిత్య చక్రవర్తి (జూనియర్ అసిస్టెంట్ ఎంపిపి), మల్లంపల్లి గ్రామానికి బి.రమేష్(టిఏ ఈజిఎస్), నాచారం గ్రామానికి మనీషా(ఏఈఓ వ్యయసాయ శాఖ), రుద్రారం గ్రామానికి (ఎస్.శ్రీనివాస్ డిటి రెవెన్యూ), వళ్లెంకుంట గ్రామానికి అనుష(ఏఈ వ్యవసాయ శాఖ)తోపాటు ఆయా గ్రామాల పంచాయతీ కారుదర్శులు అందుబాటులో ఉంటూ గ్రామపంచాయతీలో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి రిసిప్ట్ అందజేస్తారు.

## అధిక వేగం ప్రమాదాలకు మూలం

- జిల్లా ఎస్పి గౌష్ ఆలం

**నవతెలంగాణ - ములుగు**



పొగమంచు కారణంగా ట్రాఫిక్ ప్రమాదాలు పెరుగుతున్నందున రోడ్ ప్రమాదాల నివారణకు ములుగు జిల్లా ప్రజలు క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పి గౌష్ ఆలం కోరారు. రోడ్డుపై మంచు ఎక్కువగా ఉన్న సమయాలలో బీమ్ లైట్‌లో వాహనాలను నడపాలని, హై-బీమ్‌పై హెడ్‌లైట్ లను ఉపయోగించొద్దనానరు. విజిబిలిటీ 100 మీటర్ల కంటే తక్కువగా ఉంటే కారు ఫాగ్ ల్యాంప్‌ను తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. పొగమాంచులో తక్కువ వేగంతో ప్రయాణించాలని అన్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మలుపు తిరిగేటప్పుడు కనీసం పది సెకన్ల పాటు ఇండికేటర్స్ సూచన ఇవ్వాలన్నారు. వాహన అద్దాలను,విండోలను స్పష్టంగా కనిపించేలా ఉంచుకోవాలన్నారు. ఓవర్‌టేక్ చేయవద్దని, పొగమంచు ఉన్న సమయంలో సురక్షిత డ్రైవింగ్‌కు ఇది కీలకం అన్నారు. ట్రాఫిక్, వాతావరణ పరిస్థితులపై దృష్టి పెట్టడం ప్రతి డ్రైవర్ బాధ్యత అన్నారు.

## వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే

**నవతెలంగాణ-భూపాలపల్లి**



పొగమంచు కారణంగా కనిపించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, వాహనదారులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాటాడారు. పొగమంచులో వాహన అతి వేగాన్ని తగ్గించాలని అన్నారు. కనిపించని వాహనాలను వినికిడి ద్వారా గ్రహించే ప్రయత్నం చేయాలన్నారు. వాహనంలో హీటర్ ఆన్ చేస్తే పొగమంచు బారిన పడకుండా ఉంటారని అన్నారు. వాహనాల మధ్య కనీస దూరం పాటించాలని అన్నారు. పొగమంచులో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్వల్ప వ్యవధిలోనే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని, ట్రాఫిక్ , వాతావరణ పరిస్థితులపై దష్టి పెట్టి తగు జాగ్రత్తలు పాటించాలని వాహనదారులకుసూచించారు.



## ఘనంగా శ్రీ అయ్యప్ప స్వామి రథోత్సవం

**నవతెలంగాణ-గోవిందరావుపేట**

శ్రీ అయ్యప్ప స్వామి రథోత్సవం కార్యక్రమం బుధవారం మండల కేంద్రంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గాంధీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల్లో స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఎంతో పవిత్రంగా స్వామివారి రథోత్సవాన్ని ముందుకు సాగే విధంగా సహకరించారు. అనంతరం ఆలయంలో మహా అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. నేడు అయ్యప్ప స్వామి ఆలయంలో పడిపూజ కార్యక్రమం ఉంటుందని, మండలి పూజా కార్యక్రమాన్ని దాత జనగాని కుమార్ లైన్మెన్ నిర్వహిస్తున్నారని అన్నారు. మండలి పూజా కార్యక్రమాని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అయ్యప్ప మండలి సభ్యులు కోరారు.



## అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది

- శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబు

**నవతెలంగాణ-మల్హర్‌రావు**

అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు సోదరుడు,శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. కాటారం మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన నీటి వినియోగదారుల సంఘం చైర్మెన్ చిగురు సత్తయ్య ఇటివల అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడొద్దు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బియ్యం, నూనె వితరణ

**నవతెలంగాణ-గణపురం**

మండలంలోని నగరంపల్లి శివారు కొండంపల్లి గ్రామానికి చెందిన రేణిగుంట్ల సమ్మయ్య మృతిచెందగా ఆయన కుటుంబానికి బుధవారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మృతుడి కుమారులకు రేణిగుంట్ల సంపత్, శ్రీనివాసులకు బియ్యం నూనె అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు దేసు ప్రదీప్, మాజీ ప్రెసిడెంట్ కాళ్ల రంగయ్య టౌన్ ప్రెసిడెంట్, కట్కూరి శ్రీనివాస్, రంగు ముక్తేశ్వర్, బుక్క శ్రీనివాస్, కొండూరు ముక్తేశ్వర్ తదితరులు పాల్గొన్నారు



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**నవతెలంగాణ - ములుగు**

కాసిందిపేట గ్రామంలో అనారోగ్యంతో మరణించిన మాజీ వార్డ్ సభ్యుడు చెలమల్ల రామస్వామి కుటుంబ సభ్యులను బుధవారం మంత్రి సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచన మేరకు పార్టీ మండల అధ్యక్షుడు ఎండి చాంద్ పాషా ఆధ్వర్యంలో పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సుధాకర్ రావు, పిఎసిఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజు, సీనియర్ నాయకులు, దుగ్యాల సంపత్ రావు, దుగ్యల దేవేందర్ రావు, ఎన్నింఢ్ల మల్లయ్య, ఎడ్ల దేవేందర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**నవతెలంగాణ-మహాదేవపూర్**

మండలంలోని సూరారం గ్రామానికి చెందిన ములకల రాజమణి ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో ఇటీవల మృతిచెందింది. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను కాటారం, మహాదేవపూర్ సహకార బ్యాంకు చైర్మన్లు చల్లానారాయణరెడ్డి, చల్ల తిరుపతిరెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగుల లక్ష్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

అలాగే మంథని పట్టణం శ్రీ రాంనగర్‌లో సుంకవెల్లి వెంకట సుబ్బారావు మృతిచెందగా బాధిత కుటుంబాన్ని దుద్దిళ్ళ శ్రీను బాబు పరామర్శించారు.



## సింగరేణి ఎన్నికల్లో సిఐటియు ప్రచారం

**నవతెలంగాణ-గణపురం**

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సిఐటియు అభ్యర్థిని గెలుపు కోసం బుధవారం సిఐటియు నాయకులు పోలం రాజేందర్, గుర్రం దేవేందర్, అత్కూరి శ్రీధర్ ఆధ్వర్యంలో 8ఇంక్లైన్ లో ప్రచారం చేశారు. సీఐటీయూ ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వారు అభ్యర్థించారు.

## వివేకానంద టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీ

**నవతెలంగాణ-తొర్రూరు**

వివేకానంద టీచర్స్ అసోసియేషన్ చేర్యాల వారి ఆధ్వర్యంలో అసోసియేషన్ 13వ వార్షికోత్సవం సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి కోడూరు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో తొర్రూరు హైస్కూల్లో ఎంప్లాయిస్‌కి వాలీబాల్ టోర్నమెంటు బుధవారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో నాలుగు టీములు పాల్గొన్నాయని, ఇందులో గెలుపొందిన నరేష్ టీంకి స్వామి వివేకానంద పుట్టిన రోజు జనవరి 2న బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు గోడిశాల నగేష్, ప్రధాన కార్యదర్శి దేవులపల్లి శంకర్, కోశాధికారి తుమ్మల ఫణీంద్ర, అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# ప్రజా పాలనకు సన్నద్ధం..!

- నేటి నుంచి గ్రామసభలు, లబ్ధిదారుల ఎంపిక
- మండలానికి ఒక ప్రత్యేక అధికారి నియామకం

**నవతెలంగాణ-తొర్రూరు**

ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మహాలక్ష్మి (ఆర్టీసీ బస్సులో మహిళల ఉచిత ప్రయాణం), రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పది లక్షల రూపాయలకు పెంపు పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం మిగిలిన హామీల అమలుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టేందుకు ప్రజా పాలన గ్రామసభలు నిర్వహణకు సన్నద్ధమైంది. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు గ్రామ, పట్టణ, వార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం ఇప్పటికే మండల స్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేసిన ఉన్నతాధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుంది. గ్రామసభల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించింది.

**గ్రామ సభల నిర్వహణ ఇలా...**

గ్రామ జనాభా పరిగణలోకి తీసుకొని ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. మండలంలోని గ్రామాల సంఖ్య ఆధారంగా రోజు వారీగా ఎన్ని గ్రామసభలు నిర్వహించాలో నిర్ణయించారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో, తహసీల్దార్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు గ్రామసభల్లో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

**దరఖాస్తులు స్వీకరించే పథకాలు...**

గ్రామ సభల ద్వారా మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత పథకాలకు సంబంధించి ఒకే దరఖాస్తు స్వీకరిస్తారు. ఎవరు ఏ పథకానికి అర్హులో సమగ్రంగా సర్వే నిర్వహించి ఎంపిక చేయనున్నారు.

**ప్రత్యేక బృందాలు...**

ప్రజా పాలన గ్రామసభల నిర్వహణ పర్యవేక్షించేందుకు మండల మున్సిపాలిటీ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ శాఖ ప్రతినిధి, ఎంపీడీవో, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి, మండల పంచాయతీ అధికారి లేదా వ్యవసాయ శాఖ అధికారి, పౌరసరఫరాల శాఖ ప్రతినిధి, పిహెచ్‌సి వైద్యాధికారి లేదా ఆరోగ్య శాఖ అధికారి, మండల విద్యాధికారి లేదా విద్యా ప్రతినిధి, విద్యుత్ శాఖ ఏఈ లేదా విద్యుత్ శాఖ ప్రతినిధి, గ్రామపంచాయతీ కార్యదర్శులతో పాటు ఇతరశాఖలకు సంబంధించిన అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.



**సజావుగా గ్రామసభలు : వినోద్ కుమార్, తహసీల్దార్, టీం లీడర్, తొర్రూరు**

మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రత్యేక అధికారులతో పర్యవేక్షణ, సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం, వాటిని ఆన్లైన్ చేయడం జరుగుతుంది. గ్రామ జనాభా ఆధారంగా కౌంటర్లు ఏర్పాటు చేశాం.



## బోనమెత్తిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**నవతెలంగాణ-పాలకుర్తి**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిబింబంగా గ్రామదేవతలకు నిర్వహించే బోనాల వేడుకల్లో బుధవారం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి బోనమెత్తారు. మండల కేంద్రం పాలకుర్తిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా బోనాల వేడుకల్లో కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొని మహిళలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ బోనాలు గ్రామాలకు, పల్లెలకు పట్టు కొమ్మలన్నారు. అనంతరం పెద్దమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి బైరు భార్గవ్, పాలకుర్తి ఉపసర్పంచ్ తరాల చంద్రబాబు, గూడూరు, తీగారం మాజీ సర్పంచ్‌లు మాచర్ల పుల్లయ్య, పోగు శ్రీనివాస్, తీగారం ఉప సర్పంచ్ మొగుళ్ళ కుమార్, దేవస్థాన మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, పాలకుర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కమ్మగాని నాగన్న గౌడ్, కార్యదర్శి పన్నీరు వెంకన్న , మత్స్య పారిశ్రామిక సొసైటీ అధ్యక్షులు దాసరి మధు, సోమల్లు, మామిండ్ల (ఫోనెక్స్) యాకయ్య, సలేంద్ర సంపత్ పాల్గొన్నారు.

## నూతన ఎస్సైగా జీనత్ కుమార్ బాధ్యతలు స్వీకరణ

**నవతెలంగాణ-గార్ల**



మండల నూతన ఎస్సైగా నిమ్మతోట జీనత్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జీనత్ కుమార్ మరిపెడ మండలంలో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించి ఎస్సైల బదిలీల నేపథ్యంలో జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు మండలంలో బాధ్యతలుస్వీకరించారు.ఈసందర్భంగా ఎస్సై జీనత్‌కుమార్ మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులు నేరుగా ఫిర్యాదులను అందజేయవచ్చని, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తామని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు,ప్రజలు,రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కాగా ఇక్కడ ఎస్సైగా బాధ్యతలు నిర్వహించిన బానోత్ వెంకన్న జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు.

## నేటి నుండి ప్రజాపాలన గ్రామ సభలు

**నవతెలంగాణ-గార్ల**

నేటి నుండి జనవరి 6 వరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రజా పాలనా గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలకు లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపిడివో రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28న సత్యనారాయణ పురంలో ఉదయం 8 గంటలకు, చిన్నబంజరలో మధ్యాహ్నం 2 గంటలకు, పినిరెడ్డిగూడెంలో ఉదయం 8 గంటలకు, గోపాలపురంలో మధ్యాహ్నం 2 గంటలకు,29న బిఆర్ఎస్‌తండాలో,మర్రిగూడెంలో ఉదయం8గంటలకు, రాజుతండ, బుద్దారంలో మధ్యాహ్నం 2 గంటలకు,30న బాలాజీ తండ,కొట్యానాయక్ తండాలో ఉదయం 8గంటలకు, శేరిపురం, పోచారంలో మధ్యాహ్నం 2గంటలకు, జనవరి 2న గార్ల,పెద్ద కిష్టాపురంలో, పుల్లూరు, చిన్న కిష్టాపురంలో మధ్యాహ్నం 2 గంటలకు, 3న ముల్కనూరు, మద్దివంచలో ఉదయం 8గంటలకు, సీతంపేట, రాంపురం గ్రామాలలో మధ్యాహ్నం 2 గంటలకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామ సభలలో లబ్దిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**నవతెలంగాణ-లింగాలఘనపురం**

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పార్లమెంట్ బీజేపీ రాష్ట్ర నాయకులు బొజ్జపల్లి సుభాష్ అన్నారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని స్టేషన్‌ఘనపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో బుధవారం మండలం వనపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత సంకల్ప యాత్ర సందర్భంగా ప్రచార రథంలో ఎల్ఈడీ స్క్రీన్ పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని మాజీ ఎమ్మెల్యే బొజ్జపల్లి రాజయ్య తనయుడు బీజేపీ రాష్ట్ర నాయకులు బొజ్జపల్లి సుభాష్ వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.

# ప్రజాపాలనకు ప్రత్యేక అధికారుల నియామకం

**నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నేటి నుండి చేపట్టే ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య ప్రత్యేక అధికారులను నియమించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు ముగ్గురు జిల్లా ఉన్నతాధికారులను ప్రత్యేక అధికారుల నియామకంతో పాటు ఒక్కో మండలానికి ఒక్కో జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఇప్పటికే ఆయా అధికారులు క్షేత్ర స్థాయిలో పనిని ప్రారంభించారు.

**జనగామ నియోజకవర్గంలో...**

జనగామ అసెంబ్లీ నియోజవర్గానికి జిల్లా పరిషత్ సిఇఒ అనిల్ కుమార్ ప్రత్యేక అధికారి కాగా ఆ నియోజకవర్గ పరిధిలోని జనగామ మండలానికి జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర, మున్సిపల్ పరిధిలో జిల్లా సివిల్ సప్లై అధికారి రోజా రాణి, బచ్చన్నపేట మండలానికి జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి సయ్యద్ ఇస్మాయిల్, నర్మెట మండలానికి డబుల్ బెడ్ రూం ఇళ్ళ జిల్లా నోడల్ అధికారి దామోదర్‌రావు, తరిగొప్పుల మండలానికి జిల్లా మత్స్య శాఖ అధికారి నాగులు ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారు. కాగా వీరితో పాటు ఆయా మండలాలకు అదనపు ప్రత్యేక అధికారులుగా జనగామ మండలానికి జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి చౌడేశ్వరి, మున్సిపాలిటీలో మిషన్ భగీరథ ఈఈ శ్రీకాంత్, బచ్చన్నపేట మండలానికి డ్రగ్ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణ, నర్మెట మండలానికి డి.ఎం.సివిల్ సప్లై ప్రసాద్, తరిగొప్పుల మండలానికి జిల్లా పశువైద్యాధికారి నర్సయ్యలను ప్రభుత్వం నియమించింది.

**స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో...**

నియోజకవర్గ ప్రత్యేక అధికారిగా అక్కడి ఆర్‌డిఒ రామ్మూర్తితో పాటు స్టేషన్‌ఘన్‌పూర్ మండలానికి పంచాయతీరాజ్ డిఈ చంద్రశేఖర్,లింగాలఘన్‌పూర్ మండలానికి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత, రఘునాథపల్లికి జిల్లా సహకార శాఖ అధికారి రాజేందర్‌రెడ్డి, చిల్పూర్‌కు ఎస్సీ కార్పోరేషన్ ఈడి కోర్నెలియస్, జాఫర్‌ఘడ్ మండలానికి పశువైద్యాధికారి మనోహర్‌లను ప్రత్యేక అధికారులుగాను, ప్రత్యేక అదనపు అధికారులుగా స్టేషన్‌ఘన్‌పూర్‌కు వైద్యవిధాన పరిషత్ అధికారి డాక్టర్ సుగుణాకర్‌రాజు, లింగాలఘణపురానికి జిల్లా ఆడిట్ అధికారి శంకర్, రఘునాథపల్లి మండలానికి డైరీ డి.డి.ధన్‌రాజ్, చిల్పూరుకు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రమేష్, జాఫర్‌ఘడ్ మండలానికి ఈఈ మిషన్ భగీరథ (గ్రిడ్) శ్రీనివాస్‌లు అదనపు ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారు.

**పాలకుర్తి నియోజకవర్గంలో...**

ప్రజాపాలన విజయవంతానికి పాలకుర్తి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిగా జిల్లా పంచాయతీ అధికారి రంగాచారిని కలెక్టర్ నియమించారు. ప్రత్యేక అధికారులుగా పాలకుర్తి మండలానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మొగులప్ప, కొడకండ్ల మండలానికి జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి రవీందర్, దేవరుప్పుల మండలానికి జిల్లా విద్యా శాఖ అధికారి రాములను నియమించారు.

అలాగే అదనపు ప్రత్యేక అధికారులుగా పాలకుర్తి మండలానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి, కొడకండ్లకు కార్మిక శాఖ అధికారి కుమారస్వామి, దేవరుప్పులకు ఆర్అండ్‌బి ఈఈ హుస్సేన్‌లను జిల్లా కలెక్టర్ నియమించారు. కాగా మండల ప్రత్యేక అధికారులను ఎమ్మార్వో టీంగా, మండల అదనపు ప్రత్యేక అధికారులను ఎంపిడిఒ టీంగా పిలుస్తారు.

## విద్యుత్‌షాక్‌తో గొర్రెపోతు మృతి

**నవతెలంగాణ-కేసముద్రం రూరల్**



మండలంలోని రంగాపురం శివారు లోవిద్యుత్‌షాక్‌తో రాజీవ్ నగర్ తండా లకావత్ రెడ్యాకు చెందిన గొర్రెపోతు మృతి చెందింది. రెడ్యా తెలిపిన ప్రకారం మంగళవారం తన గొర్రెల మందను మేపుకొని రాత్రి తిరిగి ఇంటికి చేరుకున్నారు. గొర్రెల మందలో ఒక పెద్ద గొర్రెపోతు కనిపించలేదు. దీంతో గొర్రెపోతును వెతుక్కుంటూ వెళ్లగా రంగాపురం శివారులో ఒక వ్యవసాయ బావి వద్ద విద్యుద్ఘాతంతో మృతి చెందింది. విద్యుత్ స్తంభం నుంచి మోటారు వద్దకు వచ్చే సర్వీస్ వైరు ఫెయిల్ అయి ఉండడంతో గొర్రెపోతు ఆ వైరుకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గొర్రెపోతు విలువ 19 వేల రూపాయలు ఉంటుందని ఆయన తెలిపారు. నిరుపేద గిరిజనుడైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## సైబర్ నేరాలు, మహిళల భద్రత పై అవగాహన సదస్సు

**నవతెలంగాణ-నెల్లికుదురు**

సామాజిక అంశాలు, సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నెల్లికుదురు ఎస్సై కనుకుల క్రాంతి కిరణ్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నెల్లికుదురు ఏఎస్ఐ గుంటుక యాకన్న తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీఎస్ హైస్కూల్ ఆదర్శ పాఠశాల కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఆయా పాఠశాల హెచ్ఎంలతో కలిసి విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలతో మోసపోవద్దని, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, మీ మొబైల్లో తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ఎన్.యాకస్వామి, రమాదేవి, శిరీషతోపాటు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనపై అవగాహన : ఎంపీడీవో శేషాద్రి

**నవతెలంగాణ-నెల్లికుదురు**

మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి 15,547 కుటుంబాలకు 166 కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజలు కోరుకున్న విషయాలను ప్రభుత్వమే అందిస్తున్న ఫారంలో పూరించి గ్రామంలో నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమానికి వచ్చే అధికారులకు ఇవ్వాలన్నారు. ప్రతీ గ్రామంలో 100 కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేశామని, మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, నేటి నుండి ఆరవ తేదీ వరకు మండలంలో అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వంశీకృష్ణ, వ్యవసాయ మండల అధికారి నెలకుర్తి రవీందర్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్లు, టీం సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
హనుమకొండ
గురువారం | డిసెంబర్ 28, 2023 | www.navatelangana.com

## గణితంతోనే ఉన్నత స్థితి : నోడల్ అధికారి లింగారెడ్డి



**నవతెలంగాణ-పర్వతగిరి**

గణిత శాస్త్రం తోనే విద్యార్థుల ఉన్నత స్థితి,ఎదుగుదల బాగుంటుందని మండల నోడల్ అధికారి గాయపు లింగారెడ్డి అన్నారు. మండల కేంద్రం లో బుధవారం గణిత ఫోరం ఆధ్వర్యంలో మండలంలో వివిధ ఉన్నత పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు గణిత శాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఉన్నత పాఠశాల రమేష్, భూక్య రాములు, కే.కుమారస్వామి, వెంకట్ రెడ్డి, ఆనంద్ మోహన్, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సుబ్బయ్యపల్లిలో తెరకెక్కిన భూవివాదం

- భూకబ్జా విషయంలో ఇరువర్గాల ఘర్షణ
- సంవత్సరాలు గడిచినా కొలిక్కిరాని సమస్య
- పుట్ట రవిపై హత్యాయత్నం కేసు.. అరెస్టు.. రిమాండ్

**నవతెలంగా-హసన్‌పర్తి**

మండలంలోని దేవన్నపేట హామ్లెట్ గ్రామం సుబ్బయ్యపల్లిలో గత కొంత కాలంగా ఓ భూవివాదం విషయంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన రెండు వర్గాల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గ్రామంలో చోటు చేసుకుంటున్న వివాదం విషయంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి సమస్య పరిష్కారదిశగా ఎంత ప్రయత్నం చేసినా సమస్య కొలిక్కిరాకపోగా మరింత జఠిలమవుతోందని గ్రామస్తుల నుంచి ఆరోపణలున్నాయి. దీంతో ఇరువర్గాల మధ్య జరుగుతున్న భూవివాదంపై పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. దేవన్నపేట సర్వే నెం.113/ఇ లో భూమిపై మాజీ ఎమ్మార్పీఎస్ నాయకుడు పుట్ట శ్రీనివాస్, పుట్ట రవిల మధ్య తరచు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన ఇరు వర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ తారా స్థాయికి చేరుకుంది. భూవివాద విషయంలో రెండు వర్గాల వారి మధ్య లా అండ్ ఆర్డర్ సమస్య ఉత్పన్నం కాకుండా ఇరువర్గాల నుంచి హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి ఫిర్యాదును స్వీకరించినట్లు తెలిపారు. ఇరువురి ఫిర్యాదులపై విచారణ అనంతరం ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

మాజీ ఎమ్మార్పీఎస్ నాయకుడు పుట్ట రవిపై పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో అతన్ని కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు.

## నేటి నుంచే మండలంలో 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ

**నవతెలంగాణ-హసన్‌పర్తి**

ఆరు గ్యారంటీ స్కీములతో అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రేస్ ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు మండల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గురువారం నుంచే మండలంలోని ఆయా గ్రామాలలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించాలని మండల, కార్పొరేషన్ కమిషనర్‌కు ప్రభుత్వం జారీచేసిన జీవో ప్రతులను ఆన్‌లైన్ ద్వారా అందజేశారు. ఇందులో భాగంగా హసన్‌పర్తి మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు రెండు షిఫ్ట్‌లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామ సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తు ఫారాలు 28-12-2023 ఉదయం 10గంటల నుండి అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల యందు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తు దారుడు కుటుంబ సభ్యుల ఆదార్, తెల్ల రేషన్, గ్యాస్ బుకింగ్ పుస్తకం, ఉపాధి హామీ పథకం, భూమి పట్టా పాస్ బుక్, బ్యాక్ పాస్ పుస్తకం, 2023-24 ఇంటి పన్ను రశీదు జిరాక్స్‌కాపీలతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫోటో, మొబైల్ నెంబర్‌ను దరఖాస్తుతో పాటు వివరాలను పొందుపర్చాలని తెలిపారు.

## రవీందర్ మృతి క్రీడా కుటుంబానికే తీరని లోటు



**నవతెలంగాణ-హసన్‌పర్తి**

క్రికెట్ క్రీడాకారుడు, ఎర్రగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్ యాద రవీందర్ మృతి యావత్ క్రికెట్ క్రీడా కుటుంబానికి తీరని లోటని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం యాదవనగర్‌లో యాద రవీందర్ మొదటి వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై యాదరవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. హసన్‌పర్తి క్రీడాకారులకు పుట్టినిల్లు అని అన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదరణ లేకపోవడం వల్లే ఎంతో మంది క్రీడాకారుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు.

క్రీడాకారుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించి ఆదుకొని వారికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు చకిలం రాజేశ్వర్ రావు, వీసం సురేందర్ రెడ్డి, హసన్‌పర్తి వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పావుశెట్టి వెంకటేశం, అధ్యక్షుడు ఆకుతోట రమేష్, ప్రధాన కార్యదర్శి ఆరెల్లి వెంకటస్వామి, కోశాధికారి కోడెల మురళి, వాకర్స్ సభ్యులు, కాంగ్రేస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, గంగాధర్ మెమోరియల్ క్రికెట్ అసోసియేసన్ సభ్యులు, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్యామలచెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యేను కోరిన పార్టీల నాయకులు



**నవతెలంగాణ-హసన్‌పర్తి**

గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారం రెవెన్యూ శివారు పరిధి శ్యామల చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని భీమారంకు చెందిన వివిధ పార్టీల నాయకులు బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భీమారంకు చెందిన కాంగ్రేస్‌పార్టీ నాయకులు ఆకుల కుమార్, బీజేపీ పార్టీకి చెందిన పప్పుల రమేష్, నాతి రమేష్ సంయుక్త ఆధ్వర్యంలో భీమారం యూత్‌నాయకులు బూర శరత్, వల్లాల శ్రీధర్‌లు ఎమ్మెల్యే నాగరాజుకు శ్యామలచెరువు కబ్జా గురించి వివరించారు. హసన్‌పర్తి మండలం, గ్రేటర్ 55వ డివిజన్ భీమారం రెవెన్యూ శివారు సర్వే నెం.642లో 67.22 ఎకరాల విస్తీర్ణం కలిగిన శ్యామల చెరువులో సుమారు 35 ఎకరాలకు పైగా చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూమి కబ్జాకు గురైందనితెలిపారు. ఇటీవల జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, వరంగల్ సీపీ ఏవి.రంగనాథ్, జీడబ్ల్యుఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్‌పాషా సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వేయర్‌తో సర్వే చేయించి హద్దులు కూడా నిర్ణయించారని తెలిపారు. శ్యామల చెరువు పరిధిలో కబ్జాకు గురైన అక్రమకట్టడాల నిర్మాణాల కూల్చివేతకు సంబంధిత యజమానులకు నోటీసులు కూడా జారీ చేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్, వరంగల్ సీపీ సంయుక్త ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, కుడా, కార్పొరేషన్ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందం కబ్జాకు గురైన చెరువు శిఖంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతకు రంగం సిద్ధం కావడంతో వర్షాభావ పరిస్థితులతో పాటు శాసనసభ ఎన్నికల కారణంగా శ్యామల చెరువు పరిరక్షణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న తమరుతక్షణమే స్పందించి భీమారం శ్యామల చెరువును కబ్జాదారుల నుంచి కాపాడి గత అధికారుల పర్యవేక్షణలో నిలిచిపోయిన టాస్క్‌ను పూర్తి చేయాలన్నారు.

ప్రజాప్రయోజనాల కోసం వినియోగపడే చెరువు పరిరక్షణకు సత్వర చర్యలు తీసుకొని కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా ప్రస్తుత కేయూ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు జారీచేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు.

## 66వ డివిజన్ అభివృద్ధికి చేయూతనివ్వాలని ఎమ్మెల్యేకు వినతి



**నవతెలంగాణ-హసన్‌పర్తి**

గ్రేటర్ 66వ డివిజన్ అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ బుధవారం ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ 66వ డివిజన్ పరిధి హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ నుండి ఎల్లాపూర్ బస్టాండ్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. హసన్‌పర్తిలో కులానికి ఒక స్మశాన వాటిక ఉందని, ఉమ్మడి స్మశాన వాటిక పనులను వేగవంతం చేసి అన్ని కులాలకు ఒక వేదికగా దహన సంస్కారాల నిర్వహణకు కృషి చేయాలన్నారు. ఆర్‌టీసీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. టెండరు పూర్తై ఉండి నిర్మాణం కానీ పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రతి కార్పొరేటర్‌కి ఒక సంవత్సరానికి రూ.55 లక్షల అభివద్ధి పనులు ఇచ్చి ఇంతవరకు మళ్లీ నిధులు ఇవ్వలేదని తిరిగి నిదుల పునరుద్దరణకు చర్యలు తీసుకోవాలన్నారు. హసన్‌పర్తిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేసి సత్వరమే అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## కొండ మురళీని కలిసిన నాయకులు



**నవతెలంగాణ-హసన్‌పర్తి**

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును బుధవారం హసన్‌పర్తి మండల కాంగ్రేస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మురళిధర్‌రావును కలిసిన వారిలో మండల కాంగ్రేస్ నాయకులు రావుల శ్రీకాంత్, పోరెడ్డి ప్రశాంత్‌రెడ్డి తదితరులున్నారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



**నవతెలంగాణ-హసన్‌పర్తి**

భార్యాభర్తల మధ్య తరచు జరుగుతున్న గొడవల కారణంగా భర్త మనస్థాపంతో ఇంటి ముందు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యా చేసుకున్న ఘటన బుధవారం ముచ్చర్లలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి కథనం ప్రకారం గ్రేటర్ 1వ డివిజన్ ముచ్చెర్లకు చెందిన మట్టెడ ప్రదీప్ (32)కు అతని మేనమామ కూతురు మౌనికతో 10 ఏళ్ల క్రితమే వివాహం జరిగింది. వారికి ముగ్గురు సంతానం. గత కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య తరచు గొడవలు జరుగుతుండేవి. దీంతో భార్యాభర్తలు కలిసి ఉండే వారు కాదు. మూడు రోజుల క్రితమే మౌనికను ఆమె భర్త ప్రదీప్ ఇంటికి తీసుకొని వచ్చాడు. మంగళవారం రాత్రివీరిరువురి మధ్య తిరిగి చిన్న గొడవ చోటు చేసుకుంది. దీంతో రాత్రి భోజన సమయం తరువాత ఇంట్లో కుటుంబ సభ్యులు పడుకున్నారు. మధ్యరాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో మౌనిక నిద్రలేచి చూసే సరికి ప్రదీప్ ఇంటి ముందు జామచెట్టుకు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. క్షణికావేశంలో మనస్థాపంతో ప్రదీప్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## అర్వపల్లి రైస్ మిల్లుతో పొంచి ప్రమాదం

- రహదారి మీదకు దూసుకు వస్తున్న దుమ్ము
- మిల్లు ధూళితో పొంచి ఉన్న ముప్పు
- పట్టించుకోని పర్యావరణ శాఖ అధికారులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు



**నవతెలంగాణ-హసన్‌పర్తి**

ప్రమాదాలు జరిగితే తప్ప పరుగులు తీయని అధికారుల పనితీరుతో ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడే హడావిడి చేసే ఉన్నతాధికారులు ఆ దిశగా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రమాదాల నివారణకు సత్వర చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలు కాపాడడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... మండలంలోనిఅర్వపల్లి-బుచ్చయ్యపల్లి క్రాసురోడ్డు వద్ద రోడ్డుకు ఇరువైపుల కొనసాగుతున్న రైస్ మిల్లులతో ఆయా గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. రైసు మిల్లుల అనుమతులు లోపబూయిష్టంగా ఉన్నాయన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం రైసు మిల్లు ద్వారా వెలువడుతున్న వరిపొట్టు, దుమ్ము, దూళి లేవకుండా మిల్లు యాజమాన్యం నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే నిబందనలు తుంగలో తొక్కి ప్రజల ప్రాణలతో చెలగాటమాడుతున్నారని స్థానికులు అధికారులపై మండిపడుతున్నారు. అర్వపల్లి మీదుగా వివిధ గ్రామాలకువెళ్లే వాహనదారులు బుచ్చయ్యపల్లి క్రాసు రోడ్డు వద్దఉన్న రైసు మిల్లుల ద్వారా వెలువడుతున్న దుమ్ము దూళి కళ్లల్లోకి చేరి రోడ్డు ప్రమాదాల బారిన పడ డమే కాకుండా చుట్టు పక్కల ఇండ్లపై పేరుకుపోయి గ్రామ స్తులు శ్వాససంబంధవ్యాదులతో అనారోగ్యానికి గురవుతు న్నామని బోరుమంటున్నారు. సమస్య పరిష్కారం కోసం స ర్పంచ్, ఎంపీడీవో, తహశీల్దారు, కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడం పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి అర్వపల్లి-బుచ్చయ్యపల్లి క్రాసురోడ్డుకు ఇరు వైపుల ఉన్న రైసుమిల్లులను తనిఖీ చేసివాటి నుంచి వెలువ డుతున్న దుమ్ముదూళిని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడా లని గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే...